నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 4-12-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:93 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

తనరిన సతీసహగమన
మును రద్దొనరించిన దినమును సతతంబున్
మనమున దలంచి జరుపుము
మనదగు స్త్రీజాతికొరకు మను కార్యములన్ !!

(4-12-1829 సతీసహగమనం రద్దుచేయబడిన రోజు)

-రాధశ్రీ
సెల్:9494481210

చురక

అన్నీ కూడా హామీలు
అవుతున్నయా అమలు
కేంద్రమైనా రాష్ట్రమైనా
కల్పించుడే కదా భ్రమలు
అందరిలో వైఫల్యం
ఐనా పరనిందలు
తనివితీర పరస్పరం
తవ్వుకునే బొందలు

-వేల్పుల నారాయణ
9440433475

వాయిదా నోటీసులు తిరస్కరించిన రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్

రాజ్యసభలో మంగళవారం మామూలుగా కార్యకలాపాలు

జీరో అవర్‌లో ఎస్‌పి వాకౌట్

న్యూఢిల్లీ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్),: రోజుల పాటు సభా కార్యకలాపాలు తుడిచిపెట్టుకపోయిన తరువాత రాజ్యసభ మంగళవారం మామూలుగా పని చేసింది. ప్రజా ప్రాధాన్యం ఉన్న అంశాలను సభ్యులు ప్రస్తావించారు. సభ నిర్ణీత జీరో అవర్‌ను ముందు చేపట్టింది. ఆ తరువాత ప్రశ్నోత్తరాల సమయం సాగింది. అదానీ గ్రూప్‌పై అవినీతి ఆరోపణలు, యుపి సంభాల్‌లో హింసాకాండ సహా పలు సమస్యలపై ప్రతిపక్ష సభ్యులు రభస సృష్టిస్తుండడంతో నవంబర్ 25న శీతాకాల సెషన్ ప్రారంభమైనప్పటి నుంచి రాజ్యసభ ఎటువంటి కార్యకలాపాన్నీ నిర్వహించలేకపోయింది. కాగా, మంగళవారం జీరో అవర్ (ఉదయం సెషన్)లో సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) సభలో నుంచి వాకౌట్ చేసింది. టిఎంసి సభ్యులు కూడా కొద్ది సేపు వాకౌట్ చేశారు. 267 నిబంధన కింద తనకు 42 వాయిదా నోటీసులు అందాయని, రాజ్యాంగాన్ని ఆమోదించిన శతాబ్ది చివరి త్రైమాసికంలో ఇంత వరకు ఇవే అధికమని చైర్మన్ జగ్దీప్ ధన్‌ఖడ్ అంతకుముందు చెప్పారు. తాను నోటీసుల్లో దేనినీ అంగీకరించలేదని ఆయన తెలిపారు. ఎంపి ఒకరు 267 నిబంధన కింద ఒకటికి మించి నోటీసులు ఇచ్చారని, ఆ సభ్యునికి వాటి ప్రస్తావనకు అవకాశం ఇవ్వడం ఏమాత్రం సాధ్యం కాదని ధన్‌ఖడ్ స్పష్టం చేశారు. 267 కింద నోటీస్‌ను పరిశీలించే ముందే బహిరంగపరచడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అది 'నిబంధనలను బేఖాతరు చేయడమే' అని, అది మరీ తీవ్రమైన విషయమని చైర్మన్ అభివర్ణించారు. వివిధ పార్టీల నేతల దృష్టికి దీనిని తీసుకువెళ్లనున్నట్లు ఆయన చెప్పారు. అత్యున్నత నైతిక ప్రమాణాలు పాటించవలసిందిగా సభ్యులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఆ తరువాత సభ జీరో అవర్ ప్రస్తావనలతో సాగింది. చైర్మన్ ముందస్తు అనుమతితో ఆ సమయంలో అంశాలను సభ్యులు ప్రస్తావించారు. తమిళనాడులో ఫెంగల్ తుపాను సృష్టించిన సమస్యలను ఎం మొహమద్ అబ్దుల్లా (డిఎంకె), వైకో (ఎండిఎంకె) సభ దృష్టికి తీసుకువచ్చారు. ఒడిశా పూరిలో ప్రతిపాదిత అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పూర్తి చేసి, పని చేయించాలని సుభాశీశ్ ఖుంతియా (బిజెడి) కోరారు. రామ గోపాల్ యాదవ్ (ఎస్‌పి) సంభాల్‌లో ఇటీవలి హింసాకాండ అంశాన్ని లేవదీశారు. కాంగ్రెస్ ఎంపి ప్రమోద్ తివారి కూడా ఆ అంశంపై మాట్లాడారు

పేద ప్రజలను అడ్డగోలుగా దోచేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు

-మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రైవేటు ఆస్పత్రులపై మంత్రి జూపల్లి కృష్ణారావు కీలక కామెంట్స్ చేశారు.

పేద ప్రజలను అడ్డగోలుగా దోచేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ విద్యార్థి సమితి, యువజన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ యూత్‌డే సదస్సులో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి.. సరైన శిక్షణ లేకపోవడం వల్ల యువత పెడదారి పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం విద్య, యువత విషయంలో నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో విద్య, వైద్యం కోసం జనం విపరీతంగా ఖర్చు చేయాల్సి వచ్చిందన్నారు. కొన్ని ఆస్పత్రులు రోగులను నిలువుదోపిడి చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గొప్ప గొప్ప ఆస్పత్రులు కట్టడం కాదని.. ఆస్పత్రులు అవసరం లేని పరిస్థితి తేవాలని మంత్రి జూపల్లి అన్నారు.

గ్రేటర్‌కు మహర్దశ.. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

హైదరాబాద్, డిసెంబర్ 3:ప్రజా పాలన విజయోత్సవ వేడుకల్లో భాగంగా మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.5827 కోట్లతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు వర్చువల్‌గా ప్రారంభించారు.జి హెచ్ఎంసి పరిధిలో HCITI ఫేజ్-1లో రూ.3446 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం.

హెచ్ఎంసీ పరిధిలోని రహదారులు, జంక్షన్ల సుందరీకరణకు రూ.150 కోట్లతో పనులకు శంకుస్థాపన.కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు జంక్షన్లలో ఫ్లై ఓవర్లు అండర్ పాసుల నిర్మాణానికి శంకుస్థాపన.

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆరాంఘర్-బహదూర్పుర బారీ ఫ్లై ఓవర్.

హైదరాబాద్ రోడ్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఆర్‌డీసిఎల్) అధ్వర్యంలో గ్రేటర్ సిటీలో రూ.1500 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేసే ప్యాకేజీతో పాటు గతంలో పెండింగ్లో ఉన్న పనులకు శంకుస్థాపన చేసిన సీఎం.సిటీలో వరదనీరు నిలవకుండా వర్షపు నీటి సంరక్షణ, వరద నీటిని నియంత్రించే పనులకు రూ.17 కోట్ల అంచనాలతో చేపట్టే పనులను ప్రారంభించిన సీఎం

.హైదరాబాద్ వాటర్ బోర్డు అధ్వర్యంలో నిర్మించిన ఆరు సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ప్రారంభం.

తాగునీటి సరఫరాకు అవుటర్ రింగ్ రోడ్డు చుట్టూ వివిధ ప్రాంతాల్లో రూ.45 కోట్లతో చేపట్టిన 19 రిజర్వాయర్లను ప్రారంభించిన సీఎం.రూ.568 కోట్లతో చేపట్టే ఎస్ఎన్‌డీపీ పనులకు శంకుస్థాపన.అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనుసంధానంతో కొత్త ఆన్లైన్ బిల్డింగ్ అప్రూవల్, లేఅవుట్ అప్రూవల్ సాఫ్ట్ వేర్ ను లాంఛనంగా ప్రారంభించిన సీఎం. 2025 ఫిబ్రవరి నుంచి అమల్లోకి రానున్న విధానం.

మూసీ ప్రక్షాళనకు అఖిలపక్ష సమావేశం..

హైదరాబాద్, డిసెంబర్ 3:దేశంలోని అన్ని నగరాలను కాలుష్యం ఆక్రమించిందని అయితే, హైదరాబాద్ నగరంలో కాలుష్యానికి తావులేకుండా భవిష్యత్తు తరాల గురించి ఆలోచించి అభివృద్ధి దిశగా మన ప్రభుత్వం ముందుకు సాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మూసీ నది ప్రక్షాళన కోసం తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్టు రేవంత్ రెడ్డి తెలిపారు.

హైదరాబాద్ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం సభలో మాట్లాడుతూ? దయచేసి నగర అభివృద్ధిని అడ్డుకోవద్దని ప్రతిపక్షాలకు సూచించారు. ప్రభుత్వం చేస్తున్న పనులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే వారిని కూడా అడ్డుకుంటామన్నారు.

కాగా, మంత్రివర్గ ఉపసంఘంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబులు ఉంటారు. అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాల ప్రతిపాదనలు, సూచనలను తీసుకోనున్నారు.

గోల్డెన్ టెంపుల్ వద్ద సేవాదార్ డ్యూటీ చేసిన సుఖ్‌బీర్ బాదల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 3:శిరోమణి అకాలీ దళ్ నేత సుఖ్‌బీర్ సింగ్ బాదల మంగళవారం అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్ గేటు వద్ద సేవాదార్ డ్యూటీ నిర్వహించారు. మతపరమైన శిక్షకు సంబంధించిన ఫలకను మెడలో వేసుకున్న ఆయన.. మరికొంత మంది నేతలతో కలిసి డ్యూటీ చేశారు. శ్రీ అకాల్ తక్త్ సాహిబ్ కింద ఆయనకు ఆ శిక్షను ఖరారు చేశారు. సాద్ నేత సుఖ్‌దేవ్ సింగ్ దిండ్సా కూడా మెడలో ఫలకను, చేతిలో బల్లాన్ని పట్టుకుని.. గేటు వద్ద సెంట్రీ విధులు నిర్వహించారు. సేవ చేయాలన్న ఆదేశం ఇచ్చారని, ఇది దేవుడు ఇచ్చిన ఆదేశంగా భావిస్తానని, అకాల్ తక్త్‌లో భాగంగా ఇది జరిగిందని, గేటు వద్ద కూర్చుంటానని, లంగర్‌లో కూడా సేవ చేయనున్నట్లు సుఖ్‌బీర్ బాదల్ తెలిపారు.

సుఖ్‌బీర్ మతపరమైన ఉల్లంఘనలకు పాల్పడినట్లు సిక్కు పెద్దలు ఇటీవల తీర్మానించారు. టంకయ్యగా ఆయనకు ముద్ర వేశారు. దీంతో శిక్షలో భాగంగా ఇవాళ సుఖ్‌బీర్ సేవలో పాల్గొన్నారు. శిరోమణి అకాలీదళ్ నేత బిక్రమ్ సింగ్ మాజితియా .. గోల్డెన్ టెంపుల్‌లోని లంగర్‌లో పాత్రలను శుభ్రం చేశారు. గిన్నెలు శుభ్రం చేయడంతో పాటు షూ కూడా శుభ్రం చేయాలని మాజితియాకు శిక్ష వేశారు.

సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తే శని, ఆదివారం కూడా సభ పెడ్తా

లోక్‌సభలో సభ్యులను హెచ్చరించిన స్పీకర్ ఓమ్ బిర్లా

న్యూఢిల్లీ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : వాయిదాల కారణంగా సభా కార్యకలాపాలకు మరింత అంతరాయం వాటిల్లిన పక్షంలో ఆ సమయం నష్టాన్ని భర్తీ చేయడానికి వారాంతాల్లో తాను సభా కార్యక్రమాలను నిర్వహించవలసి వస్తుందని లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా మంగళవారం సభ్యులను హెచ్చరించారు. పార్లమెంట్‌లో వారం రోజులుగా సాగుతున్న ప్రతిష్టంభనను అంతం చేయడానికి ప్రభుత్వం, ప్రతిపక్షాలు సోమవారం ఒక ఒప్పందానికి వచ్చిన విషయం విదితమే. రాజ్యాంగాన్ని ఆమోదించిన 75వ వార్షికోత్సవం సందర్భంగా లోక్‌సభ, రాజ్యసభలలో రాజ్యాంగంపై చర్చకు తేదీలను ప్రకటించడమైంది. రాజ్యాంగంపై దిగువ సభలో ఈ నెల 13, 14 తేదీల్లోను, ఎగువ సభలో 16, 17 తేదీల్లోను చర్చ చేపడతారు .మంగళవారం ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన వెంటనే స్పీకర్ బిర్లా మాట్లాడుతూ.. 'సభ 14 ఉదయం 11 గంటలకు సమావేశం అవుతుంది. మీరు వాయిదాలు కొనసాగించినట్లయితే వాయిదా పడిన రోజులకు సంబంధించి మీరు శని, ఆదివారాల్లో కూడా సభా కార్యకలాపాలకు హాజరు కావలసి ఉంటుంది' అని స్పష్టం చేశారు. మంగళవారం ఎటువంటి వాయిదా నోటీసుల వర్తమానాన్నీ తాను అనుమతించలేదని కూడా బిర్లా చెప్పారు. అదానీ వివాదం, ఉత్తర ప్రదేశ్ సంభాల్‌లో ఇటీవలి హింసాకాండ, తదితర సమస్యలపై ప్రతిపక్ష సభ్యుల నిరసనల కారణంగా క్రితం వారం లోక్‌సభ కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయాయి.

5న మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్, ప్రమాణ స్వీకారోత్సవం

- ఉప ముఖ్యమంత్రిగా ఏక్‌నాథ్ షిండే

ముంబాయ్ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్)బిమహారాష్ట్ర ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అకస్మాత్తుగా తన వైఖరి మార్చుకున్నారని, రోజుల తరబడి ముమ్మరంగా సంప్రదింపులు సాగించిన అనంతరం రానున్న మహాయుతి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతల నిర్వహణకు ఆయన అంగీకరించినట్లు అభిజ్ఞ వర్గాలు తెలియజేశాయి. ఆ వర్గాల సమాచారం ప్రకారం, బిజెపి నేత దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా తిరిగి అధికార బాధ్యతలు చేపట్టనున్నారు. గురువారం (5న) ముంబయిలో అత్యున్నత స్థాయి ప్రమాణ స్వీకారోత్సవంలో ఫడ్నవీస్, ఎన్‌సిపి నేత అజిత్ పవార్‌తో కలసి షిండే ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇది షిండే వైఖరిలో గణనీయమైన మార్పును సూచిస్తోంది. రెండు సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా మహారాష్ట్రకు సారథ్యం వహించిన శివసేన అధిపతి ఫడ్నవీస్ కింద ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు అంగీకరించేందుకు తొలుత విముఖంగా ఉన్నారని సమాచారం.

మహాయుతి భాగస్వామ్య పక్షాలు బిజెపి, శివసేన, ఎన్‌సిపి మధ్య మంత్రి పదవులు, మంత్రిత్వశాఖల కేటాయింపు ఆ ముగ్గురి ప్రమాణ స్వీకారం అనంతరం జరగవచ్చు. ఈ పరిణామం దృష్ట్యా మహాయుతి కూటమిలో అంతా సవ్యంగా ఉందని, ప్రమాణ స్వీకారోత్సవం ముందు నిర్ణయించిన ప్రకారమే సాగుతుందని శివసేన నేత సంజయ్ శిర్సాట్ తెలిపారు. 'ఆ ముగ్గురు నేతలు కూర్చుని, మాట్లాడుకున్నారు. గందరగోళం ఏమీ లేదు' అని శిర్సాట్ చెప్పారు. మహాయుతి భాగస్వామ్య పక్షాల్లో బిజెపి హోమ్, రెవెన్యూ వంటి కీలక శాఖలతో సహా 2122 మంత్రిత్వశాఖలు పొందవచ్చు. పార్టీ స్పీకర్, శాసన మండలి చైర్మన్ పదవులను అట్టిపెట్టుకోవచ్చు. ఇక శివసేన 16 మంత్రిత్వశాఖలు అడిగింది. కానీ పట్టణ అభివృద్ధి శాఖ సహా 12 మంత్రిత్వశాఖలతో పార్టీ సరిపెట్టుకోవచ్చు. పార్టీ శాసన మండలి చైర్మన్ పదవి కోసం కూడా పోటీ పడుతోంది.

పార్టీకి ఇప్పటికే డిప్యూటీ చైర్మన్ పదవి ఉంది. కాగా, ఎన్‌సిపి ఆర్థిక, డిప్యూటీ స్పీకర్ సహా 910 మంత్రిత్వశాఖలు పొందవచ్చు.గొంతు ఇన్ఫెక్షన్; జ్వరం వల్ల ఠాణెలోని ఒక ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్న షిండే రానున్న రోజుల్లో క్యాబినెట్ పదవుల ఖరారుపై చర్చలకు సారథ్యం వహిస్తారని ఆ వర్గాలు తెలియజేశాయి. కాగా, ఆసుపత్రి నుంచి బయటకు వచ్చిన తరువాత ఆరోగ్యం గురించిన ప్రశ్నకు 'నేను బాగానే ఉన్నాను' అని షిండే సమాధానం ఇచ్చారు. ప్రమాణ స్వీకారోత్సవం సన్నాహకాల కోసం మహారాష్ట్ర అధికారులతో షిండే సమావేశాన్ని ఏర్పాటు చేయవచ్చు. ఇది ఇలా ఉండగా, బిజెపి శాసనసభా పక్షం తమ నేతను ఎన్నుకునేందుకు బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం కానున్నది. ఆ సమావేశం తరువాత తమ ముఖ్యమంత్రి అభ్యర్థిపై బిజెపి లాంఛనంగా ప్రకటన చేయవచ్చు.

కాళ్లు, చేతులు కట్టేసి కారులో హత్య

రంగంపేట డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: వరంగల్ జిల్లా రంగంపేటలో గుర్తు తెలియని వ్యక్తిని హత్య చేశారు. కెఎంసి ఎదురుగా కాళ్లు, చేతులు కట్టేసి దుండగులు హత్య చేశారు.

హత్య చేసి మృతదేహం కారులో దుండగులు వదిలేశారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఆస్పత్రికి తరలించారు. మృతుడిని రాజమోహన్ గా గుర్తించారు. కత్తులతో పొడిచి హత్య చేశారని పోలీసులు వెల్లడించారు. బంగారం కోసమే హత్య చేసి ఉంటారని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపణలు చేస్తున్నారు. కారు నంబర్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన శ్రీకాంతాచారి ప్రాణత్యాగం: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 3: శ్రీకాంతాచారి అమరత్వం గొప్పదని, ఆయన ప్రాణత్యాగం తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారులపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దమనకాండ, కేసీఆర్ అరెస్టును చూసి తట్టుకోలేక పోయిన శ్రీకాంతాచారి అగ్నికి అహుతి అయ్యి అమరుడయ్యారని చెప్పారు. ఆయన ప్రాణత్యాగం తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిందన్నారు. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఎక్స్ వేదికగా జోహార్లు అర్పించారు.

'శ్రీకాంతాచారి అమరత్వం గొప్పది. ఆయన ప్రాణత్యాగం తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువరు. తెలంగాణ ఉద్యమకారులపై నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దమనకాండ, కేసీఆర్ గారి అరెస్ట్ ను చూసి తట్టుకోలేకపోయిన శ్రీకాంతాచారి అగ్నికి అహుతి అయ్యి అమరుడయ్యాడు. శ్రీకాంతాచారి ప్రాణత్యాగం తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసింది. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆయనకు జోహార్లు అర్పిస్తున్నాను. జోహార్ శ్రీకాంతాచారి! జై తెలంగాణ.' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

నిన్న తృణమూల్, ఇవాళ సమాజ్‌వాదీ పార్టీ.. కాంగ్రెస్ నిరసనకు దూరం

న్యూఢిల్లీ, డిసెంబర్ 3:కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమిలో చీలకలు వచ్చినట్లు తెలుస్తోంది. అదానీ అంశంలో జేపీసీ వేయాలని కోరుతూ ఇవాళ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఆవరణలో ధర్నా చేపట్టింది. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంకా గాంధీతో పాటు కాంగ్రెస్ పార్టీ నేతలు భారీ ప్రదర్శన చేపట్టారు. అయితే ఆ నిరసన ప్రదర్శనలో కాంగ్రెస్ మిత్రపక్షాలు మిస్సయ్యాయి. సోమవారం జరిగిన ఇండియా కూటమి మీటింగ్‌కు తృణమూల్ కాంగ్రెస్ పార్టీ దూరం అయ్యింది. అయితే ఇవాళ కాంగ్రెస్ చేపట్టిన నిరసనకు సమాజ్‌వాదీ పార్టీ గైర్హాజరైంది.

కాంగ్రెస్ పార్టీ ఏకపక్ష ఎజెండాతో ముందుకు వెళ్తున్నట్లు తమ నిరసనలతో స్పష్టం అవుతున్నది. మిత్రపక్షాల డిమాండ్ గురించి కాంగ్రెస్ పట్టించుకోవడం లేదు. పార్లమెంట్‌లో ఇండియా కూటమి నేతలు ఆరు అంశాలపై ప్రశ్నలు వేయాలనుకున్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, నిధుల కోత, మణిపూర్ సంక్షోభం లాంటి అంశాలపై కూడా చర్చ జరగాలని ఇండియా కూటమి పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం కేవలం అదానీ అంశాన్నే ప్రస్తావిస్తున్నది. దీంతో ఖర్గే నిర్వహించిన మీటింగ్‌కు టీఎంసీ, ఎస్పీ దూరంగా ఉన్నాయి.

లోక్‌సభలో బీజేపీ, కాంగ్రెస్ తర్వాత అతిపెద్ద మూడవ పార్టీ అయిన ఎస్పీ .. ఇవాళ జరిగిన నిరసన ప్రదర్శనలో పాల్గొనలేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఆహ్వానము

"బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్"

విశాఖ సంస్కృతి మాసపత్రిక సౌజన్యంతో

నిర్వహించిన 8వ జాతీయ స్థాయి కథల పోటీ విజేతలకు బహుమతి ప్రదాన సభ

వేదిక :

కొరటాల సమావేశ మందిరం (CPM ఆఫీసు)

2/7 బ్రాడీపేట, గుంటూరు

తేది : ది.08-12-2024, ఆదివారం

ఉదయం 10:30 నుండి 11:00 సంగీత విభావరి, తదుపరి

సభా కార్యక్రమము

సభాధ్యక్షులు : శ్రీ చందు సాంబశివరావు, ప్రముఖ విద్యావేత్త, నాసాసైంటిస్ట్ (రి)

విశిష్ట అతిథి : శ్రీ దేగల ప్రభాకర్ గారు అధ్యక్షులు - APIDC

ఆత్మీయ అతిథులు : శ్రీ ఉగ్గిరాల సీతారామయ్య, ప్రముఖ తెలుగుదేశం నాయకులు

శ్రీ శిరేల సన్యాసిరావు, ఎడిటర్ : విశాఖ సంస్కృతి మాసపత్రిక

కథల విశ్లేషకులు : శ్రీ శిరంశెట్టి కాంతారావు, సీనియర్ కథా రచయిత, పాల్వంచ

ఆహ్వానించు వారు : శ్రీ బండికల్లు జమదగ్ని, GIC - A గ్రేడ్ సర్వేయర్

శ్రీ బండికల్లు శ్యామ్‌ప్రసాద్, KBSS గుంటూరు జిల్లా అధ్యక్షులు

వందన సమర్పణ : శ్రీమతి ఉగ్గిరాల రేణుక, టీచర్

కథల పోటీ విజేతలు

1. శ్రీమతి రోహిణి నంజారు, కోఠాపేట, హైదరాబాదు
2. శ్రీమతి గంగవరపు సునీత, చిలకలూరిపేట
3. శ్రీమతి మద్దిరాల విజయ శ్రీముఖి, వీరపనేని గూడెం, కృష్ణా జిల్లా
4. శ్రీ పారుపల్లి అజయ్ కుమార్, పువ్వాడనగర్, ఖమ్మం
5. శ్రీ మొలకలపల్లి కోటేశ్వరరావు, పమిడిపాడు, బాపట్ల జిల్లా
6. శ్రీ ఆకెళ్ళ సూర్యనారాయణ మూర్తి, రామాంతపూర్, హైదరాబాదు

జీవనసాఫల్య పురస్కార గ్రహీత

శ్రీ చందు సాంబశివరావు

మాజీ నాసా శాస్త్రవేత్త, రాజకీయ విశ్లేషకులు

స్ఫూర్తి పురస్కార గ్రహీతలు

1. శ్రీమతి తాటికోల పద్మావతి, సీనియర్ కథారచయిత్రి, గుంటూరు
2. శ్రీమతి కోడే యామిని దేవి, ప్రముఖ కవయిత్రి, మర్లపాలెం, గన్నవరం మండలం
3. శ్రీ అచ్చుల సుబ్బారావు, సాహితీరంగ ప్రముఖులు, సంతగుడిపాడు
4. శ్రీ రాసంశెట్టి నరసింహారావు, సంచాలకులు, ఏ.పి.సాంస్కృతిక విద్యాపీఠం
5. శ్రీ మిరియాల ప్రసాదరావు, కళలు, సేవారంగ ప్రముఖులు
6. శ్రీ డా॥ రవి, యం.యస్. ఆర్థోపెడీషియన్, విజయవాడ
7. శ్రీమతి దాసరి లక్ష్మీ దుర్గ, 16వ డివిజన్ కార్పొరేటర్
8. శ్రీమతి ఆయిశెట్టి కనకదుర్గా శ్రీనివాస్, 56వ డివిజన్ కార్పొరేటర్
9. శ్రీ నిశ్శంకరరావు రవికుమార్, గోల్డ్‌మెడలిస్ట్ - 2024 వరల్డ్ బాడీ బిల్డింగ్
10. శ్రీ డా॥ జెస్లిస్ వజ్రగిరి, ప్రముఖ చిత్రకారులు, వినుకొండ

శ్రీ మాత్రే నమః

అక్కిరాజు ఆర్ట్స్

హైదరాబాద్.

ఆహ్వానం

తిరుపతి వాస్తవ్యులు, సుప్రసిద్ధ శతావధాని, అవధాన సరస్వతి, అవధాన మురళి

"ఆముదాల మురళి" గారిచే

అష్టావధాన కార్యక్రమం

08-12-2024 ఆదివారం సా॥ 6 గం॥లకు

వేదిక : శృంగేరీ శంకర మఠం, నల్లకుంట, హైదరాబాదు.

సభా కార్యక్రమం :

సభా ప్రారంభకులు : ప్రొ. ముదిగొండ శివ ప్రసాద్

ముఖ్య అతిథి : యం. నరసింహస్వామి, ఐ.ఆర్.యస్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కం టాక్స్ (రిటైర్డ్)

గౌరవ అతిథి : శ్రీ టి.వి. రమణమూర్తి (విజయ విహారం)

విశిష్ట అతిథి : శ్రీ జె.వి. రావు, హై కోర్టు అడ్వకేట్ & ట్యాక్స్ కన్సల్టెంటు

ప్రత్యేక అతిథి : శ్రీ పేరి వేంకటరమణ, కవితా పోషకుడు

పృచ్ఛకుల పేర్లు...

నిషిద్ధాక్షరి : శ్రీ ఎల్లా ప్రగడ రామకృష్ణ రావు

సమస్య : శ్రీ ఆచార్య ఫణీంద్ర

దత్తపది : శ్రీ జీడిగుంట వేంకట్రావ్

వర్ణన : శ్రీ కాకర్ల హనుమంత రావు

వ్యస్తాక్షరి : శ్రీ. వి.వి. సత్య ప్రసాద్

ఆశువు : శ్రీ పి.టి.జి.వి. రంగా చార్యులు

పురాణం : శ్రీ పంత్రి ప్రగడ శ్రీనివాస రావు

అప్రస్తుతం : శ్రీ శంకర నారాయణ

సంచాలకులు : డా॥ అక్కిరాజు సుందర రామకృష్ణ

శ్రీమతి జొన్నలగడ్డ సుహాసిని బృందంచే అన్నమాచార్య సంగీత విభావరి

డా॥ అక్కిరాజు, అధ్యక్షుడు 988 50 20205

పంత్రప్రగడ శ్రీనివాస్, కార్యదర్శి 9100 0091 51

"శుభం భూయాత్"

సమరోత్సాహం, శౌర్య పరాక్రమాలకు ప్రతీక భారత నావికా దళం !

(04 డిసెంబర్ "భారతీయ నావికా దళ దినోత్సవం" సందర్భంగా)

భారతీయ త్రివిధ దళాలైన ఆర్మీ, ఏయిర్ ఫోర్స్, నావికా దళం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైనవిగా రుజువు చేసుకున్నాయి. 1612లో నాటి ఈస్ట్ ఇండియా కంపెనీ తన అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన చిన్న నావికా దళం, స్వాతంత్ర్యానంతరం తనను తాను దేశ అవసరాలకు అనుగుణంగా మార్చుకుంటూ, ఇన్నొవేషన్ ఆసరాతో స్వదేశీ పరిజ్ఞాన గొడుగు కింది అతి బలశాలిగా అవతరించడం మనందరికీ గర్వకారణం. అంకితభావం, సమరోత్సాహం, శౌర్య పరాక్రమాలు, క్రమశిక్షణ లాంటి కవచాలను ధరించి దేశానికి విజయాలను తేవడంతో పాటు సముద్ర తీరాల గస్తీ, దేశ భద్రత, అంతర్జాతీయ సంబంధాల్లో ఊతం ఇవ్వడం, దేశ ఆర్థికాభివృద్ధిలో తోడ్పడడం, ప్రపంచ శాంతి స్థాపనకు పీస్ కీపింగ్ ఫోర్స్‌గా పని చేయడం, విపత్తు నిర్వహణ, సముద్రయానంలో ఇన్నొవేషన్, గస్తీలో శాస్త్ర సాంకేతిక అభివృద్ధితో పాటు వినియోగం లాంటి పలు మహత్తర సేవలను అనునిత్యం అందిస్తున్నది.

1971 ఇండో-పాక్ యుద్ధంలో "ఆపరేషన్ ట్రిడెంట్":

1971 ఇండో-పాక్ యుద్ధ సమయంలో 03 డిసెంబర్ రోజున పాకిస్థానీ సేనలు భారత ఏయిర్ బేస్‌లపై ఆకస్మికంగా ముప్పేట దాడి చేయడం, దానికి ప్రతిస్పందనగా 4, 5 డిసెంబర్ 1971 రోజుల్లో భారత నావికా దళాలు "ఆపరేషన్ ట్రిడెంట్" పేరున కరాచీ టలోని పాకిస్థానీ నావికా దళ కేంద్రంపై దాడి చేయడంతో వేల కొది పాకిస్థానీ సైనికులు మరణించడం, భారత్‌కు తిరుగులేని విజయాన్ని ఇవ్వడం మన గత ఘన చరిత్ర. ఇండియన్ నావీ నేతృత్వంలో "ఆపరేషన్ ట్రిడెంట్" అర్చించి పెట్టిన ఘన విజయానికి గుర్తుగా ప్రతి ఏట 04 డిసెంబర్‌న "భారతీయ నావికా దళ దినోత్సం" ఘనంగా నిర్వహించుట ఆనవాయితీగా మారింది. దేశ భద్రత, విపత్తు సమయాల్లో అమూల్య సేవలు, సముద్ర తీర ప్రాంతాల పకడ్బందీ గస్తీ లాంటి పలు అమూల్య సేవలు అందించడంతో పాటు యుద్ధ సమయాల్లో లేదా దేశ రక్షణ విధులు నిర్వహిస్తున్న మన నావికా దళ అమరవీరులకు ఘన నివాళులు అర్పించడం, వారి సేవలను స్మరించుకోవవడం, నావికా దళ వీరులకు కృతజ్ఞతలు తెలియజేయడం దేశ భక్తి పరులుగా మనందరి కనీస భాద్యత.

భారత నావికా దళ దినోత్సవం-2024 థీమ్:

04 డిసెంబర్ 2024న నిర్వహించుకుంటున్న భారతీయ నావికా దళ దినోత్సవ థీమ్‌గా "ఇన్నొవేషన్, స్వదేశీకరణతో భారత నావికా దళం భవిష్యత్తులో మహా శక్తివంతం ఎదగడం" అనే అంశాన్ని తీసుకొని ఆ దిశగా పటిష్ట అడుగులు వేస్తున్నది. స్వదేశీ టెక్నాలజీ వినియోగంతో బలపడడం, వినూత్న శాస్త్ర సాంకేతిక ప్రగతి వినియోగంతో నావీ సేవలు బలీయం కావడం కొనసాగుతూనే ఉన్నది. 04 డిసెంబర్ వేడుకలు న్యూఢిల్లీ గేట్‌వే ఆఫ్ ఇండియా కూడలిలో సాంస్కృతి కార్యక్రమాలు, అమర వీరులకు శ్రద్ధాంజలి గటించడం, విశిష్ట సేవలకు తగు గుర్తింపులు/ పతకాలు ఇవ్వడం ఘనంగా జరుగుతుంది.

భారతీయ నావికా దళం:

1612లో ఒక చిన్న దళంగా ప్రారంభమైన భారత నావికా దళం నేడు 67,252 మంది చురుకైన దళం, 75,000 రిజర్వ్ దళాలతో అభేద్యంగా, మహాశక్తివంతమైన సముద్రయాన/తీర గస్తీ దళంగా ఆవిర్భవించింది. "శామ్ నొ వరునా (పవిత్ర జలదేవత దీవెనలతో)" అనే నినాదంతో దేశ భద్రతే పరమ లక్ష్యంగా 150 నావలు/జలాంతర్గాములు, 300 ఏయిర్‌క్రాఫ్టుల బలంతో అభేద్యంగా మారడం హర్షదాయకం.

భరతమాత సేవలో పుణీతం అవుతున్న భారత త్రివిధ దళాలు, నేడు ముఖ్యంగా నావికా దళ శౌర్య పరాక్రమ సాహస వీరులకు, అమరవీరుల కుటుంబాలకు వినయంగా కృతజ్ఞతలు తెలియజేద్దాం. నేల, జలం, ఆకాశమే హద్దుగా మన త్రివిధ దళాలకు సలాం చేద్దాం.

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

కొత్తగా తెచ్చిన మూడు నేర విచారణ చట్టాల అమలు విజయవంతం

న్యూఢిల్లీ, డిసెంబర్ 3:పెనుమార్పులతో తీసుకువచ్చిన మూడు కొత్త నేర విచారణ చట్టాలు.. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్‌లను విజయవంతం కావడాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, 2024 డిసెంబర్ 3న మధ్యాహ్నం 12 గంటలకు చండీగఢ్ లో ఏర్పాటైన ఓ కార్యక్రమంలో జాతికి అంకితం చేయనున్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా కొనసాగుతున్న వలస చట్టాలను తొలగించడంతో పాటు, న్యాయ వ్యవస్థ దృక్పథాన్ని శిక్ష నుంచి న్యాయం వైపునకు మరల్చుతూ- ఆ వ్యవస్థలో కీలకమార్పులు తీసుకురావాలన్న ప్రధానమంత్రి దార్శనికత నుంచి స్ఫూర్తిని పొంది ఈ మూడు చట్టాలను రూపొందించారు. దీనిని దృష్టిలో పెట్టుకొని, "రక్షణ సమాజం, శిక్ష నుంచి న్యాయం దిశగా - అభివృద్ధి చెందిన భారతదేశం" అనే విషయాన్ని ఈ కార్యక్రమానికి ఇతివృత్తంగా ఎంచుకొన్నారు.

కొత్త నేర విచారణ చట్టాలు 2024 జులై 1న దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. భారతదేశంలో న్యాయవ్యవస్థ మరింత పారదర్శకంగా, సమర్థంగా, సమకాలీన సమాజం అవసరాలను తీర్చేదిగా ఉండేలా చూడడం ఈ చట్టాల ఉద్దేశం. భారతదేశంలో నేర సంబంధిత న్యాయ వ్యవస్థను గణనీయ స్థాయిలో ప్రక్షాళన చేసి, సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాల వంటి ఆధునిక కాలపు సవాళ్ళను పరిష్కరించడంతోపాటు వివిధ నేరాల బాధితులకు న్యాయాన్ని అందించడానికి సరికొత్త ప్రాథమిక కార్యాచరణ ప్రణాళికలను ఈ ప్రధాన సంస్కరణలు ఆవిష్కరించాయి.

ఈ చట్టాల ఆచరణీయ విధానాన్ని కార్యక్రమంలో చాటిచెప్పనున్నారు. నేర సంబంధిత న్యాయ ముఖచిత్రం రూపురేఖలను ఈ చట్టాలు ఇప్పటికే ఏ విధంగా చక్కదిద్దాయన్నది కూడా ఈ కార్యక్రమంలో వివరించనున్నారు. ఒక నేరం జరిగినట్లుగా ఓ సన్నివేశాన్ని కల్పించి, దానికి సంబంధించిన దృశ్యాన్ను కొత్త చట్టాల ప్రకారం ఏయే విధాలుగా నిర్వహించవచ్చో ప్రత్యక్షంగా సభికులకు వివరించే కార్యక్రమం కూడా దీనిలో భాగంగా ఉండబోతున్నది.

డెహ్రాడూన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా

ప్రతి రెండేళ్ళకు ఒకసారి అటవీ విస్తీర్ణం ఏ స్థాయిలో ఉంది లెక్కగడుతూ ఉంటుంది...

న్యూఢిల్లీ, డిసెంబర్ 3:పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ ఆధీనంలో ఉన్న, డెహ్రాడూన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) ప్రతి రెండేళ్ళకు ఒకసారి అటవీ విస్తీర్ణం ఏ స్థాయిలో ఉందీ లెక్కగడుతూ ఉంటుంది. దేశంలో అడవులు ఉన్న ప్రాంతం స్థితి తాజా నివేదిక (ఐఎస్ఎఫ్ఆర్) 2021 ప్రకారం, దేశం మొత్తం మీద అడవులు 7,13,789 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. ఇది దేశ భౌగోళిక ప్రాంతంలో 21.71 శాతానికి సమానంగా ఉంది. గత అయిదు సంవత్సరాలలో దేశంలో అడవులు విస్తరించిన ప్రాంతాల వివరాలను రాష్ట్రంవారీగాను, కేంద్రపాలిత ప్రాంతంవారీగాను అనుబంధంలో పొందుపరిచారు.

ఐఎస్ఎఫ్ఆర్ 2017 లెక్కలతో పోల్చి ఐఎస్ఎఫ్ఆర్ 2021 లెక్కలను చూసినట్లయితే అడవులు, వృక్షాలు ఉన్న ప్రాంతాలలో 7,449 చ.కి.మీ. మేర వృద్ధి నమోదైంది. అడవులు, వృక్షాలు విస్తరించిన ప్రాంతాలలో ఎలాంటి క్షీణత లేనందువల్ల ఆ కారణంగా వాతావరణంలోకి బొగ్గుపులుసు వాయువు (సీఓ2) అధికంగా చొరబడుతోందన్న ప్రశ్నకు తావే లేదు.

2021 సంవత్సర ఐఎస్ఎఫ్ఆర్ నివేదికకు, గ్లోబల్ ఫారెస్ట్ వాచ్ సమాచారానికి మధ్య తేడా ఉందంటే దానికి, అటవీ ప్రాంతాల సంరక్షణకు, మొక్కల పెంపకానికి సంబంధించి ఈ రెండు నివేదికల నిర్వచనాల్లో వ్యత్యాసాలు ఉండడం కారణం కావచ్చు.

అటవీ (సంరక్షణ) చట్టం, 1980 ని 2023 ఆగస్టు 4న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ మాధ్యం ద్వారా సవరించారు. సవరించిన నియమ నిబంధనలు 2023 సంవత్సరంలోనే డిసెంబరు 1 నుంచి అమల్లోకి వచ్చాయి. అడవుల సంరక్షణను, నిర్వహణను, అడవులను నరికివేసిన ప్రాంతాలలో మళ్లీ వాటిని పెంచే దిశలో చేసే ప్రయత్నాలను ప్రోత్సహించడానికి, పర్యావరణపరంగా స్థిరాభివృద్ధి లక్ష్యానికి తోడ్పడడానికి, పర్యావరణానికి ఏ లోటు రాకుండా చూడడానికి, అడవులతో ముడిపడిన సాంస్కృతిక విలువలను, సాంప్రదాయక విలువలను పరిరక్షించడానికి, కర్బన ఉద్గారాలు పెరిగిపోకుండా చూస్తూనే ఆర్థిక అవసరాలను తీర్చే ఉద్దేశంతో కూడా ఈ సవరణలను అమలుచేస్తున్నారు.

కొన్యాక్: ఫిలిం బజార్ 2024లో స్క్రీన్ రైటర్ ల్యాబ్ విజేతగా నిలిచిన చిత్రం

న్యూఢిల్లీ, డిసెంబర్ 3:ఔత్సాహిక దర్శకులను ప్రోత్సహించేందుకు నేషనల్ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ) నిర్వహించిన 55వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ) వేడుకలతో పాటు ఫిలిం బజార్ 2024 అట్టహాసంగా ముగిసింది. ప్రతిష్ఠాత్మక స్క్రీన్ రైటర్స్ ల్యాబ్ విజేతగా ఫీచర్ చిత్రం కొన్యాక్ నిలిచిందన్న ప్రకటన కార్యక్రమ ప్రధాన ఆకర్షణల్లో ఒకటిగా నిలిచింది. ఎన్ఎఫ్‌డీసీ స్క్రీన్ రైటర్స్ ల్యాబ్, 2024నకు ఎంపికైన కొన్యాక్ అందరి దృష్టిని ఆకర్షించింది. రూ.100 కోట్లతో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు సినీ నిర్మాతలు ముందుకు వచ్చారు.

ఉద్భవ్ ఘోష్ రచించిన 'కొన్యాక్' ద్వారా పంకజ్ కుమార్ దర్శకుడిగా పరిచయమవుతారు. ఆయన తుంబాడ్ సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశారు. ఆ చిత్రంలో ప్రేక్షకులను లీనమయ్యేలా చేసిన ఆయన, ఈసారి తన కథన నైపుణ్యంతో 'కొన్యాక్'ను తెరకెక్కిస్తారు. ఈ చిత్రం గురించి ఉత్సాహంగా వివరిస్తూ "కొన్యాక్ యాక్షన్ కథ మాత్రమే కాదు. ఇది నాగాలాండ్ యోధులు, సమాజం, తప్పును సహించని తత్వాల అంతరంగ అన్వేషణ. దీని ద్వారా గొప్ప సినిమా అనుభూతిని, దేనికీ లొంగని స్ఫూర్తిని ప్రేక్షకులకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని పంకజ్ కుమార్ తెలిపారు.

అంతర్జాతీయ నిపుణురాలు క్లెయిర్ డొబిన్ మార్గనిర్దేశం చేసిన 'కొన్యాక్' కథ- మనుగడ, గౌరవం, విముక్తి అనే సార్వజనీన ఇతివృత్తాలతో సంస్కృతిని జోడించిన శక్తివంతమైన సినిమాగా మెరిసింది. స్క్రీన్ రైటర్స్ లాబ్ మెంటార్ క్లెయిర్ ఈ కథను ప్రశంసిస్తూ, "మోసం, ధైర్యం, ఎదుర్కోగల సామర్థ్యాన్ని తెలియజేస్తూనే మరచిపోలేని, అంతగా ప్రాచుర్యం పొందని వ్యక్తులను కొన్యాక్ వెలుగులోకి తీసుకువస్తుంది" అని అన్నారు. ఈ కథనానికి మరింత పదును పెట్టేందుకు, ఈ ప్రాంత చరిత్రకు, సంస్కృతికి లోబడి ఉంటూనే జానపద కథలు, వాస్తవాన్ని మిళితం చేయడానికి అవసరమైన వేదికను ఉద్భవ్ ఘోష్‌కు ల్యాబ్ అందించింది. సాంస్కృతిక వారసత్వం, వాస్తవికత మాయాజాలం, ఆకర్షణీయమైన కథల మేళవింపుతో ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల మనసులను గెలుచుకుంటుంది. అలాగే భారతీయ సినిమాను అంతర్జాతీయ ప్రమాణాలకు తగినట్టుగా మలచడంలో ఫిలింబజార్ లాంటి కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలియజేస్తుంది.

ఫిలిం బజార్ 2024 స్క్రీన్ రైటర్స్ ల్యాబ్ లో తీర్చిదిద్దిన ఎన్నో కథలు జాతీయ, అంతర్జాతీయ చిత్రదర్శకుల దృష్టిని ఆకర్షించాయి. ఇది మార్కెట్ డిమాండుకు అనుగుణంగా సృజనాత్మక ప్రతిభను అందించేందుకు ఈ ల్యాబ్ చేస్తున్న నిరంతర ప్రయత్నాలను ఇది సూచిస్తుంది.

ఈ ఏడాది ఎన్ఎఫ్‌డీసీకి 21 రాష్ట్రాల నుంచి వచ్చిన 150 దరఖాస్తుల నుంచి వివిధ సాహిత్య ప్రక్రియలకు చెందిన 6 ప్రాజెక్టులను ఎన్ఎఫ్‌డీసీ స్క్రీన్‌రైటర్స్ ల్యాబ్ 18వ ఎడిషన్‌కు ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా అసలైన కథలను అభివృద్ధి చేసి, ప్రోత్సహించి, మద్దతు అందించే కార్యక్రమం ఇది. నవలా రచయితలుగా, ప్రకటనలకు, లఘుచిత్రాలకు, డాక్యుమెంటరీలు, ఫీచర్ చిత్రాలకు పనిచేసిన అనుభవం ఈ ఆరుగురు కథా రచయితలకు ఉంది. అలాగే హిందీ, ఉర్దూ, పహాడీ, పంజాబీ, అస్సామీ, మలయాళం, కొన్యాక్, ఇంగ్లీష్, మైథిలీ సహా ఎంపిక చేసిన వివిధ భాషల్లో స్క్రిప్టులు కూడా వీరు రాశారు.



4 నుంచి రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ జాగృతి సమీక్షా సమావేశాలు

జగిత్యాల డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: జైలు నుంచి విడుదలయ్యాక కొన్నాళ్లు మౌనంగా ఉన్న బిఆర్ఎస్ ఎంఎల్ సి కవిత తన కార్యక్రమాల స్పీడు పెంచారు. బిఆర్ఎస్ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నారు. తాజాగా ఆమె మరో నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 4 నుంచి తెలంగాణ జాగృతి సమీక్షా సమావేశాలు నిర్వహించబోతున్నారు. ఆమె పర్యటన తాలూకు షెడ్యూల ్:డిసెంబర్ 4: వరంగల్, నిజామాబాద్,డిసెంబర్ 5: కరీంనగర్, నల్గొండ,డిసెంబర్ 6: రంగారెడ్డి, ఆదిలాబాద్,డిసెంబర్ 7: హైదరాబాద్, ఖమ్మం,డిసెంబర్ 8: మెదక్, మహబూబ్ నగర్.

ఏపీలో తొలిసారిగా రెండు తెలుగు రాష్ట్రాల అధికారులు భేటీ

అమరావతి డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఏపీలో తొలిసారిగా రెండు తెలుగు రాష్ట్రాల అధికారులు భేటీ అయ్యారు. రాష్ట్ర విభజన సమస్యపై మంగళగిరిలోని ఏపీ ఐఐనీ కార్యాలయంలో ఏపీ, తెలంగాణ అధికారుల కమిటీ సమావేశమైంది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు తెలంగాణ సీఎస్ శాంతికుమారి, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవి గుప్తా విజయవాడకు వెళ్లారు. ఏపీ సీఎస్ నీరభ్‌కుమార్, తెలంగాణ సీఎస్ శాంతికుమారి నేతృత్వంలో రెండు తెలుగు రాష్ట్రాల అధికారులు సమావేశమై.. పెండింగ్‌లో ఉన్న సమస్యలపై చర్చిస్తున్నారు.రెండు తెలుగు రాష్ట్రాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారమే అజెండాగా ఇరు రాష్ట్రాల సీఎస్‌ల ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతున్నట్లు తెలుస్తోంది. విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్‌లోని సంస్థల ఆస్తుల పంపకంపై ప్రధానంగా చర్చించనున్నారు. వీటితో పాటు విద్యుత్ బకాయిలు, ఉద్యోగుల పరస్పర మార్పిడి, వృత్తి పన్ను పంపకంపై అధికారుల కమిటీ చర్చించనున్నట్లు తెలుస్తోంది. 2024 జూలై 5 తేదీన సీఎంల సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలపై అధికారులు లోతుగా చర్చించే అవకాశం ఉందని సమాచారం.

కాలుష్య వ్యర్థాల విడుదల..

రుద్ర టెక్నాలజీ మూసివేతకు పీసీబీ ఆదేశం..

హైదరాబాద్ ,డిసెంబర్ 3:కాలుష్య వ్యర్థాలను విడుదల చేస్తున్న రుద్ర టెక్నాలజీ పరిశ్రమను మూసివేయాలని కాలుష్య నియంత్రణ మండలి నేడు ఆదేశాలు జారీ చేసింది. వివరాలలోకి వెళితే? అత్తాపూర్ బాపు ఘాట్ బ్రిడ్జి వద్ద కెమికల్ వ్యర్థాలను మూసీనదిలో కలుపుతున్న ట్యాంకర్లను స్థానికులు నెల 26వ తేదిన రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తాండూర్, పటాన్ చెరు, షాద్ నగర్ సహా వివిధ ప్రాంతాలకు చెందిన కెమికల్ ఫ్యాక్టరీల నుంచి వ్యర్థాలను తీసుకువచ్చి ఈ ప్రాంతంలో డంప్ చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. మూసీ వెంబడి ఖాళీ స్థలాన్ని కబ్జా చేసిన కొంతమంది వ్యక్తులు.. అక్కడ ఇసుక వ్యాపారం, లారీల పార్కింగ్ పెట్టారు. వాటి మాటున ఎవ్వరికీ అనుమానం రాకుండా నదిలో వ్యర్థాలు కలుపుతున్నారు.

ఇదే క్రమంలో కెమికల్ వ్యర్థాలు ఖాళీ చేస్తున్న లారీని మాత్రం పట్టుకోగలికారు. సమాచారాన్ని పోలీసులకు, కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేశారు స్థానికులు.. అధికారులు అక్కడికి పచ్చి ఎపి 28 టిడి 4699 నెంబర్ ట్యాంకర్ ను సీజ్ చేశారు. ఇందులోని డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు.. అతడి నుంచి సేకరించిన వివరాల అధారంగా రుద్రా టెక్నాలజీస్ (శ్రీనివాస ల్యాబ్స్) ఈ వ్యర్థాలను మూసిలో గత కొంత కాలంగా కలుపుతున్నట్లు తేలింది. భారీ ట్యాంకర్ కావడంతో ట్రిప్పునకు రూ.25వేలు చెల్లిస్తున్నట్లు డ్రైవర్ వెల్లడించాడు., ఒక్కో ట్యాంకర్‌లో 20వేల లీటర్ల వ్యర్థాలు పడతాయని, అలాంటివి రోజుకు 10ట్యాంకర్లు వస్తున్నట్లు కాలుష్య నియంత్ర మండలి అధికారులు గుర్తించారు.

ఈ నేపథ్యంలోనే రుద్రా టెక్నాలజీస్ (శ్రీనివాస ల్యాబ్స్) కు కాలుష్య నివారణ మండలి నోటీసులు జారీ చేసింది.. వారి నుంచి సంతృప్తికర సమాధానం రాకపోవడంతో రుద్రా టెక్నాలజీస్ ను వెంటనే మూసి వేయవలసిందిగా అధికారులు ఆదేశాఉ జారీ చేశారు.. ఈ నిర్ణయం తక్షణం అమలులోకి వస్తుందని పిసిపి నేడు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

సీఎం కప్ పోటీల్లో జిల్లాను అగ్రగామిగా నిలపాలి అదనపు కలెక్టర్ నగేష్

మెదక్, డిసెంబర్ 3:రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత మున్సిపల్ చైర్ పర్సన్ చంద్రపాల్ ×మెదక్ బాలుర జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం నుండి రాందాస్ చౌరస్తా వరకు ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు లో భాగంగా 02 కే రన్ నిర్వహణ క్రీడాకారులు, వివిధ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల, విద్యార్థిని విద్యార్థులు, క్రీడాభిమానులతో ఉత్సాహవంతంగా కొనసాగింది, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం పూర్తికానున్న నేపథ్యంలో డిసెంబర్ 1 నుండి 9 వరకు నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల సంబరాలలో భాగంగా మంగళవారం డిసెంబరు మూడవరోజు మెదక్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం నుండి రాందాస్ చౌరస్తా వరకు జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో సీఎం కప్ ను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన 2కె రన్ ను అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ చైర్ పర్సన్ చంద్రపాల్ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఉపాధ్యాయులు జిల్లా అధికారులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, క్రీడాకారులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ఈ ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు జిల్లాలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని ఈనెల 7, 8 తేదీల్లో గ్రామస్థాయిలో, 10 నుండి 12వ తేదీ వరకు మండల స్థాయిలో, 16 నుండి 21వ తేదీ వరకు జిల్లా స్థాయిలో ఆయా కమిటీల ఆధ్వర్యంలో వివిధ క్రీడా అంశాల్లో సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు, తెలిపారు.మెదక్ జిల్లా నుండి ఈ పోటీల్లో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.మెదక్ జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయితోపాటు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని అదనపు కలెక్టర్ ఆకాంక్షించారు.మున్సిపల్ చైర్ పర్సన్ చంద్రపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్యానికి ప్రాధాన్యత కల్పిస్తుందని మహిళలకు ఉచిత బస్సు అతిపెద్ద విజయం అని, ఉచిత కరెంటు గ్యాస్ సబ్సిడీ ,రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఇవన్నీ ప్రజలకు అందిస్తూ రైతాంగానికి పెద్ద పీట వేస్తుందని చెప్పారు. ఈ ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు మెదక్ జిల్లాలో ఇంత ఘనంగా నిర్వహించడానికి జిల్లా పాలనాధికారులు తీసుకుంటున్న చొరవ అభినందనీయమని అన్నారు.2కె రన్ ద్వారా ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు తెలిసే విధంగా ప్రచార నిర్వహిస్తున్నామన్నారుఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి దామోదర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ అధికారి జమ్లా నాయక్, ఎస్సీ సంక్షేమ అధికారి శశికళ, మెదక్ పట్టణ క్రీడాకారులు, క్రీడాభిమానులు ,వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

మనో సంకల్పం ముందు వైకల్యం అవరోధం కాదు

-కలెక్టర్ పి. ప్రావిణ్య

హన్మకొండ, డిసెంబర్ 3: (నేటినిజం ప్రతినిధి)మనో సంకల్పం ముందు వైకల్యం అవరోధం

కాదని జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య అన్నారు,అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రోజున డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్ లో జిల్లా మహిళలు పిల్లలు దివ్యాంగులు మరియు వయో వృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం జిల్లా సంక్షేమ అధికారి జే జయంతి అధ్యక్షతన జరిగింది, అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ సంవత్సరం థీమ్(సమిష్టి మరియు స్థిరమైన భవిష్యత్తు కోసం వైకల్యాలు ఉన్న వైకల్యాలు ఉన్న వ్యక్తుల నాయకత్వాన్ని విస్తరించడం) - ఉద్దేశించి మాట్లాడుతూ వైకల్యం ఉన్నదని బాధ పడుతూ కూర్చోక భవిష్యత్ పై దృష్టి సారించి జీవితాన్ని మలచుకోవాలని, వైకల్యం ఉండి ఉన్న స్థితి నుండి అత్యున్నత స్థితికి ఎదిగిన వారి జీవితాలను ఆదర్శంగా చేసుకొని భవిష్యత్ దిశగా పయనించాలని అన్నారు. దివ్యాంగులై జీవితంలో ఎదిగిన వారు మరో పది మందికి ఆదర్శంగా నిలవాలని, ఆ పది మంది మరో కొంతమందికి ఆదర్శమై సంఘటిత శక్తి ఎదగాలని ఆకాంక్షించారు, ఉన్నత విద్యను అభ్యసించిన వారు, ఉపాధి రంగాల్లో రాణించాలనుకునేవారు ఓబీఎంఎస్ ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకునే వారు పోర్టల్ లో అప్లై చేసుకోవాలని, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగం పొందాలనుకునేవారు ఉపాధి శిక్షణ అధికారి పోర్టల్ లో సంప్రదించాలని, అర్హులైన మహిళా దివ్యాంగులు మహిళా శక్తి పథకాల ద్వారా రాణించాలని అన్నారు. అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సౌకర్యార్థం ప్రతి ప్రభుత్వ కార్యాలయంకు వచ్చినప్పుడు వారికి ర్యాంపు సౌకర్యం కల్పించాలని అట్టి నిబంధనలు ఇదివరకే అన

ఆటోనగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్‌లో రోగులను సందర్శించిన ఈఎస్ఐ హాస్పిటల్ గుణదల, విజయవాడ మరియు ఈఎస్ఐ డిస్పెన్సరీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 3:ప్రభుత్వ కార్మిక డ ఉపాధి కార్యదర్శి శ్రీమతి సుమితా దావ్రా గారి అధ్యక్షతన సమీక్షా సమావేశం ఈఎస్ఐసి ప్రాంతీయ కార్యాలయం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్‌లో 02.12.2024 న జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో కార్మిక రాజ్య భీమా (ఇూఎ) స్కీమ్ వృద్ధి గణనీయంగా ఉందని, ఈ పథకం తన కవరేజీని విస్తృత శ్రేణి పరిశ్రమలు మరియు రంగాలను చేర్చడానికి విస్తరించిందని, అవసరమైన ఆరోగ్య సంరక్షణ మరియు ఆర్థిక రక్షణ తో ఎక్కువ మంది కార్మికులు ప్రయోజనం పొందేలా చూస్తారని కార్యదర్శి తెలిపారు. ఈఎస్ఐ ఆసుపత్రులు మరియు డిస్పెన్సరీలతో సహా వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు సమర్థవంతమైన సేవలను అందించడానికి సాంకేతికతను ఉపయోగించుటతో, శ్రామిక శక్తికి నాణ్యమైన ఆరోగ్య సంరక్షణకు సేవలు గణనీయంగా మెరుగు పడ్డాయని తెలియచేసారు.

ఈ సందర్భంలో భారత ప్రభుత్వ ప్రయత్నాలతో కార్మిక రాజ్య భీమా (ఇూఎ) పథకం 36 రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలలోని 668 జిల్లాలకు చేరుకుంది, సుమారు 3.72 కోట్ల మంది బీమా కార్మికుల సామాజిక భద్రత మరియు వైద్య సంరక్షణ అవసరాలను తీర్చడం మరియు 14.43 కోట్ల మంది లబ్ధిదారులకు సేవలు అందిస్తుంది. ఇంకా, ప్రభుత్వం రెండు అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ పథకాలైన కార్మిక రాజ్య భీమా ఇూఎఅ మరియు ఆయుష్మాన్ భారత్ – ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (ః–ఖఓఏంజ) యొక్క కలయికపై పని చేస్తోంది, తద్వారా ఈఎస్ఐ ఇూఎ పథకం యొక్క విస్తరణను మిగిలిన అమలు కాని జిల్లాలకు ః–ఖఓఏంజ ఎంప్యానెల్ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా లబ్ధిదారులకు వైద్య సంరక్షణ అందించేందుకు కృషి చేస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడలోని గుణదలలో ఈఎస్ఐ ఆసుపత్రిని సందర్శించిన సెక్రటరీ, అక్కడ రోగులతో మమేకమై ఆసుపత్రి సమర్థవంతంగా పని చేస్తున్నందుకు ప్రశంసించారు. లబ్దిదారులకు అందించే నాణ్యమైన వైద్య సేవలను ఆమె ప్రశంసించారు మరియు రోగులకు ఆరోగ్యం కోసం వైద్య సేవల కొరకు అంకితభావంతో ఉన్న ఆసుపత్రి సిబ్బందిని ఆమె ప్రశంసించారు. విజయవాడలోని ఆటోనగర్‌లోని ఇఎన్ఐ డిస్పెన్సరీని కూడా సందర్శించిన ఆమె, ఇ–కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లు, రవాణా పరిశ్రమ, పికిల్ పరిశ్రమ మరియు కొరియర్ సేవలలో కార్మికుల సామాజిక భద్రతా అవసరాలను ఈఎస్ఐ పథకం సమర్థవంతంగా పరిష్కరిస్తోందని ఆమె గమనించారు. విభిన్న శ్రేణి కార్మికులకు ఆరోగ్య సంరక్షణ మరియు ఆర్థిక రక్షణను విస్తరించడంలో, వారి శ్రేయస్సు మరియు భద్రతకు భరోసా కల్పించడంలో పథకం యొక్క కీలక పాత్రను ఆమె తెలిపారు.

కార్మికులకు సకాలంలో సేవలు అందేలా మరియు పథకం కింద పెరుగుతున్న కార్మికులకు వైద్య సంరక్షణ డిమాండ్‌కు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ఈఎస్ఐ ఇూఎ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను షెడ్యూల్ చేసిన గడువులోపు పూర్తి చేయాలని కార్యదర్శి ఆదేశించారు. శ్రామికశక్తిలో ఇూఎ పథకం ప్రయోజనాల గురించి గరిష్ట అవగాహన కల్పించేందుకు నిరంతర ఔట్రీచ్ కార్యక్రమాల అవసరాన్ని కూడా ఆమె తెలిపారు. అదనంగా, ఆరోగ్య సంరక్షణకు ప్రాప్యతను మెరుగుపరచడానికి మరియు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్మికుల శ్రేయస్సును ప్రోత్సహించడానికి క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీ శిబిరాలను నిర్వహించడం యొక్క ప్రాముఖ్యతను ఆమె ప్రత్యేకముగా తెలిపారు.

ఈఎస్ఐ పథకం మొదటగా అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని కేంద్రాలలో 01.05.1955 నుండి అమలు చేయబడుతున్నది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మొత్తం 26 జిల్లాల్లోని 679 మండలాల్లో ఇూఎ పథకం అమలులో ఉంది. ఇూఎ పథకం యొక్క అడ్మినిస్ట్రేటివ్ ఫంక్షన్‌ను 01 ప్రాంతీయ కార్యాలయం, విశాఖపట్నం మరియు తిరుపతిలో ఒక్కొక్కటి 02 ఉప–ప్రాంతీయ కార్యాలయాలు, 19 బ్రాంచ్ కార్యాలయాలు మరియు 4 ఆఅజాలు చూస్తున్నాయి. ఇూఎ పథకం, ప్రస్తుతం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 54 లక్షల మంది లబ్ధిదారుల సామాజిక భద్రత అవసరాలను తీరుస్తోంది. 2023–24 సంవత్సరంలో మొత్తం 1,53,793 పేమెంట్స్తో ఈఎస్ఐ లబ్ధిదారులకు రూ.80 కోట్ల చెల్లింపులు జరిగాయి. 2024–25 సంవత్సరంలో ఈఎస్ఐ కార్పొరేషన్ ద్వారా దాదాపు 97,787 మంది కార్మికులకు వివిధ ప్రయోజనాల కింద రూ.56 కోట్లు ఇప్పటికే పంపిణీ చేయబడ్డాయి.

మల్లయ్య డెడ్ బాడీ భద్రపరచండి..

–ములుగు ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు..

హైదరాబాద్ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ములుగు ఎన్‌కౌంటర్ కేసుపై హైకోర్టులో మంగళవారం విచారణ చేపట్టింది. మృతదేహాలను పోస్ట్ మార్టం ప్రక్రియ సరిగ్గా చేయలేదని పిటిషనర్ తరుఫు న్యాయవాది వాదనలు వినిపించారు. దీనికి ప్రభుత్వ తరుపు న్యాయవాది సమాధానమిస్తూ.. 8 మంది వైద్య నిపుణులతో పంచనామా పూర్తి చేశామని కోర్టుకు తెలిపారు.అనంతరం, ఎన్‌కౌంటర్ పరిణామాలతో పాటు తదుపరి చర్యలు, పోస్ట్ మార్టం రిపోర్ట్‌ను అందజేయాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. మృతి చెందిన మల్లయ్య మృతదేహం తప్ప మిగిలిన మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని కోర్టు చెప్పింది. అయితే.. మృత దేహాలు భద్రపరచడం ద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని ప్రభుత్వ తరుపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీంతో తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు కోర్టు వెల్లడించింది

అమృత్ పథకం కింద 66 ప్రాజెక్టులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 3:ది అటల్ మిషన్ ఫర్ రిజువినేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్ఫర్మేషన్ (అమృత్)ను 2015 జూన్ 25న దేశవ్యాప్తంగా 500 నగరాల (485 నగరాలతోపాటు విలీనం చేసిన మరో 15 నగరాలతో కలిపి)తోపాటు పట్టణాలలో మొదలైంది. అమృత్ పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో 12 నగరాలు ఉన్నాయి. అవి: ఆదిలాబాద్, గ్రేటర్ హైదరాబాద్ నగరపాలక సంస్థ (జీహెచ్ఎంసీ), కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మిర్యాలగూడ, నల్గొండ, నిజామాబాద్, రామగుండం, సిద్ధిపేట, సూర్యాపేట, వరంగల్.

తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సమాచారం ప్రకారం...అమృత్ పథకం కింద 66 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. ఇందులో రూ. 1,424.09 కోట్ల విలువ కలిగిన 27 నీటి సరఫరా ప్రాజెక్టులు, రూ. 203.3 కోట్ల విలువ గల 4 మురికినీటి, సెప్టిక్ ట్యాంకు వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులు, రూ. 35.69 కోట్ల విలువైన 35 హరిత స్థలాలు, పార్కు ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయ్యాయి. ఈ

అమృత్‌లో భాగంగా 4,336.54 కిలో మీటర్ల పొడవైన నీటి సరఫరా గొట్టపుమార్గాన్ని, 278.53 కిమీ పొడవైన మురికినీటి పారుదల గొట్టపుమార్గాన్ని ఏర్పాటు చేశాం. 5.54 లక్షల నల్లా నీటి కనెక్షన్లు, 0.87 లక్షల మురుగునీటి పారుదల కనెక్షన్లు అమృత్, కన్‌వర్జెన్స్‌లో భాగంగా సమకూర్చాం. దీనికి అదనంగా, తెలంగాణ రాష్ట్రంలో 18.25 ఎమ్ఎల్‌డీ సామర్థ్యం కలిగిన సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (ఎస్‌టీపి)ను, 442.45 ఎకరాల విస్తీర్ణంలో హరిత క్షేత్రాలను అమృత్‌లో భాగంగా అభివృద్ధి చేశారు. ఈ ప్రాజెక్టులకు రూ. 1,663.08 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ. 832.6 కోట్లను కేంద్ర ప్రభుత్వ సాయంగా (సీఏ) ఉంది. అమృత్ లో భాగంగా విడుదల చేసిన రూ.831.52 కోట్లలో... రూ. 806.21 కోట్లను ఉపయోగించినట్లు రాష్ట్రం నివేదించింది.

ఈ సమాచారాన్ని గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ మనోహర్ లాల్ నేడు రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

ఆరోగ్యంతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవాలి.

–అదనపు కలెక్టర్ చంద్రశేఖర్.

సంగారెడ్డి, డిసెంబర్ 3: (నేటినిజం ప్రతినిధి):ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమం లో భాగంగా మంగళవారం నిర్వహించి న సిఎం కప్ 2కె రన్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ 2కె రన్ సంగారెడ్డి ఐబి నుండి అంబేద్కర్ స్టేడియం వరకు ఉత్సాహపూర్వకంగా సాగింది. ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడం, శారీరక , మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్వహి ంచిన ఈ కార్యక్రమం సందడిగా సాగింది.ఈ కార్యక్రమం ప్రారంభాని కి ముందు అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ, ప్రజలలో సావ మూహిక ఉత్తేజాన్ని కలిగించే విధంగా ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఆరోగ్యంతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవడం ప్రస్తుత తరుణంలో అత్యంత అవసరం అని ఆయన తెలి పారు.యువతలో ఉత్తేజాన్ని పెంచే విధంగా ఇలాంటి కార్యక్ర మాలు మరిన్ని నిర్వహించాలన్నారు., ప్రజల సహకారంతో జిల్లాను అభి వృద్ధి పథంలో నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా అధికారు లు తెలిపారు. ఈ కార్యక్రమం లో ట్రైని కలెక్టర్ మనోజ్, సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి, జిల్లా యువజన సంక్షే మ శాఖ అధికారి ఖాసీం బేగ్, తహసీల్దార్ దేవదాస్, టి జి ఈ జె ఏ సి చైర్మన్ ఏం డి జావీద్ ఆలీ, ఇతర అధికారులు, వివిధ యువజన సంఘాలు, విద్యార్థులు,ఉత్సాహంగా పాల్గొన్నా రు.

స్టెల్లా షిప్ సీజ్ చేశాం: విచారణ జరుపుతున్నాం - కలెక్టర్

అమరావతి, డిసెంబర్ 3:ఆంధ్రప్రదేశ్ : కాకినాడ పోర్టులో ఉన్న స్టెల్లా షిప్‌లోకి బియ్యం ఎలా వచ్చిందనే విషయాన్ని త్వరలో తెలుసుకుంటామని ఆ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ అన్నారు. కలెక్టరేట్‌లో నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ, షిప్ లో ఉన్నవి 40 శాతం రేషన్ బియ్యమేనని ఆయన స్పష్టం చేశారు.. ప్రభుత్వం సీజ్ చేసి,ఆ తర్వాత విడుదల చేసిన ఆ రేషన్ బియ్యం షిప్ లోకి తిరిగి ఎలా చేరాయనే దానిపై దర్యాప్తు చేపట్టామని చెప్పారు. గోదాం నుంచి షిప్ వరకూ రేషన్ బియ్యం ఎలా అక్రమ రవాణా అయిందో తెలుసుకుంటామన్నారు. ఇందులోని బియ్యం మొత్తం పేదల బియ్యమేనా అనే కోణంలోనూ విచారణ జరుపుతామన్నారు. దీనిపై ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు.

ఈ బృందంలో రెవెన్యూ, పోలీసు, పౌరసరఫరాల శాఖ, కస్టమ్స్, పోర్టు అథారిటీ అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ప్రతి లోడ్ ను పరిశీలించి బియ్యం ఎక్కడి నుంచి వచ్చాయో విచారిస్తామని చెప్పారు. తనిఖీలకు విధివిధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు. అక్రమ బియ్యం రవాణా పై ఎవరైనా 7993332244 నంబర్ కు ఫోన్ చేసి సమాచారాన్ని ఇవ్వవచ్చని తెలిపారు..

కాకినాడ పోర్టు అక్రమాలపై కేబినేట్ లో వాడీ వేడి చర్చ

–కఠిన చర్యలు తీసుకోవాలన్న మంత్రులు
–కమిటీ నివేదిక కోసం వేచి చూద్దామన్న చంద్రబాబు
–10 అంశాలపై కేబినేట్ చర్చ
–కొత్త క్రీడా పాలసీకి గ్రీన్ సిగ్నల్
–డిసెంబర్ 15న ఆత్మార్పణ దినం పాటించాలని నిర్ణయం

అమరావతి, డిసెంబర్ 3:కాకినాడలో ఎగుమతులు, దిగుమతులు నిబంధలకు అనుగుణంగా జరగాలని ఎపి మంత్రి వర్గ సమావేశం నిర్ణయించింది.. ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు అధ్యక్షతన జరిగిన కేబినేట్ భేటీలో మొత్తం 10 అంశాలపై చర్చించారు. ముఖ్యంగా కాకినాడ పోర్ట్

లో రేషన్ ఎగుమతులపైనే గంటన్నర పాటు చర్చ జరిగింది.. ఉప ముఖ్యమంత్రి పవన్ ఇటీవల కాకినాడలో పర్యటించి సేకరించిన వివరాలపై కూడా మంత్రులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.. పేదలకు అందాల్సిన బియ్యం అక్రమం మార్గంలో మరీ ముఖ్యంగా కాకినాడ పోర్ట్ నుంచి తరలిపోవడం పట్ల పలువురు మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఎగుమతులు, దిగుమతులు సజావుగా సాగేందుకు తీసుకోవలసిన చర్యల గురించి చంద్రబాబు మంత్రుల అభిప్రాయాలను సేకరించారు.. పోర్టు అక్రమాలపై ఇప్పటికే వేసిన అయిదుగురు కమిటీ సభ్యుల నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుందామని కేబినేట్ ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం.

కొత్త క్రీడా పాలసీకి గ్రీన్ సిగ్నల్ .

ఐటీ అండ్ గ్లోబల్ కేపాసిటీ సెంటర్స్ పాలసీ 4.0 అంటే ఆర్‌టీజీని పునర్వ్యవస్థీకరించే అంశంపై వెర్షన్ 4.0 అమలుపై మంత్రి వర్గంలో చర్చించి ఆమోద ముద్ర వేశారు. అలాగే ఏపీ టెక్స్‌టైల్స్ అండ్ గార్మెంట్స్ పాలసీ, ఏపీ మారిటైమ్ పాలసీ 4.0, ఏపీ టూరిజం పాలసీ, స్పోర్ట్స్ పాలసీలకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఒలంపిక్స్, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన వారికి ఇచ్చే ప్రోత్సకాలను పెంచుతూ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది కేబినెట్. ఇక నూతన క్రీడా విధానానికి ఆమోద ముద్ర లభించింది.

అలాగే పొట్టి శ్రీరాములు వర్ధంతి డిసెంబర్ 15 ను ఆత్మార్పణ దినంగా రాష్ట్ర ఉత్సవంగా జరిపేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఆయుర్వేద, హోమియోపతి మెడికల్ ప్రాక్టిషనర్స్ రిజిస్ట్రేషన్ ఆక్ట్‌లో సవరణల బిల్లుకు కేబినెట్ ఓకే చెప్పింది. దీంతో పాటు 41 వ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం లో తీసుకున్న నిర్ణయాలకు కూడా ఏపీ కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపింది. ఈ నెల 15 నుంచి అమరావతిలో పనులు ప్రారంభించాలని కూడా నిర్ణయించింది

క్యూలో ఉన్న భక్తులతో టీటీడీ చైర్మన్ మాటామంతీ

తిరుపతి, డిసెంబర్ 3:తిరుమలలోని శ్రీవారి దర్శన క్యూలైన్లలో టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఏటీజీహెచ్ వద్దనున్న స్లాటెడ్ సర్వ దర్శన క్యూలైన్లను పరిశీలించి నారాయణగిరి షెడ్ల వద్దకు చేరుకున్నారు. అనంతరం ఫుట్ పాత్ హాల్ (దివ్యదర్శనం) ను తనిఖీ చేసి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన క్యూలైన్ లో టీటీడీ అందిస్తున్న సేవలపై భక్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కొందరు భక్తులు లడ్డూలు రుచికరంగా, నాణ్యంగా ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. మరికొందరు భక్తులు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనంలో తమకు దర్శనం మరింత త్వరగా అయ్యేలా ఏర్పాట్లు చేయాలని చైర్మన్ ను కోరారు. క్యూలైన్ల విధానం, దర్శన సమయం వంటి అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి తగిన ఏర్పాట్లు చేపడతామని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, వైకుంఠం ఏవీఎస్ఓ విశ్వనాధ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భవానీ దీక్షల విరమణకు ప్రత్యేక ఏర్పాట్లు..

అమరావతి, డిసెంబర్ 3:: భవానీ దీక్షలు విరమణ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుండి వచ్చే భవానీల కోసం పగటిబందిగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు పేర్కొన్నారు.

భవాని దీక్షల విరమణ సందర్భంగా శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఆలయ, పోలీస్ అధికారులతో నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు.

ఈ సమీక్షా సమావేశంలో భవాని దీక్ష విరమణలకు చేయాల్సిని ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి, క్యూలైన్లలో రద్ది, స్నానఘాట్ల వద్ద రద్ది, ప్రసాదం కౌంటర్ల వద్ద రద్దీని తగ్గించి భక్తులకు త్వరితగతిన అమ్మవారి దర్శనం అయ్యేవిధంగా గిరి ప్రదక్షణ సమయంలో భవాని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగుకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో కూలంకషంగా చర్చించారు.

ప్రత్యేకంగా భవాని దీక్ష విరమణ చేయడానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం, సమాచార నిమిత్తం ఒక ప్రత్యేకమైన యాప్ ను రూపొందించాలని చర్చించారు.

విరమణ నిమిత్తం వచ్చు భక్తులకు ఒక యాప్ లోనే పూర్తి సమాచారం అందే విధంగా ఉండేలా యాప్ ను రూపొందించాలని దేవస్థాన ఐటీ అధికారులకు సూచనలు చేసినారు.

దీని ద్వారా దీక్ష విరమణకు వచ్చిన భక్తులు సులభంగా సమాచారం తెలుసుకుని త్వరితగతిన వారి వారి గమ్యస్థానాలకు చేరుకోవడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా గిరి ప్రదక్షణ సమయంలో ట్రాఫిక్ నిర్వహణ, బందోబస్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు డి.సి.పి.లు గౌతమి షాలి, తిరుమలేశ్వర రెడ్డి, ఎ.డి.సి.పి జి.రామకృష్ణ , ఏ.సి.పి. శ్రీ దుర్గారావు, ఇన్స్పెక్టర్ గురు ప్రకాష్, దేవస్థాన ఈ ఈ వైకుంఠ రావు , ఎన్.ఐలు, దేవస్థాన ఐ. టి ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతానెంబర్ కోసం రూ.25వేల లంచం.. –ఏసీబీ డీఎస్పీ శిరీష

అమరావతి, డిసెంబర్ 3: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరు మండలం తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయంపైన జిల్లా ఏసీబీ డీఎస్పీ శిరీష పూర్తి వివరాలు మీడియాకు తెలిపారు. ఇవాళ ఏసీబీ అధికారులు ఈ కార్యాలయంపై దాడి చేశారు. విచారణ అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడారు.

పంటపాళెం గ్రామానికి చెందిన ఓ రైతు తన తల్లి కాంతమ్మ పొలానికి సంబంధించి నోషనల్ నెంబర్ తొలగించి ఖాతా నెంబర్ వేసి రికార్డు సరిచేయాలని తహసీల్దార్ కు విన్నవించగా, ఆయన రూ.25వేలు లంచం డిమాండ్ చేశారని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. బాధితులు కార్యాలయంలో తహసీల్దార్ కు లంచం ఇస్తుండగా ఏసీబీ పట్టుకుందని తెలిపారు. విచారణ పూర్తయిన తర్వాత రిమాండ్ కు తరలిస్తామని డీఎస్పీ చెప్పారు.

అపార్ట్ మెంట్ పై నుంచి దూకి ప్రేమజంట ఆత్మహత్య

అమరావతి, డిసెంబర్ 3:ఓ ప్రేమజంట బలవన్మరణానికి పాల్పడిన హృదయ విదారక ఘటన గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కిరెడ్డిపాలెంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అమలాపురం ప్రాంతానికి చెందిన పిల్లి దుర్గారావు, సాయి సుష్మిత కుటుంబాలు బతుకుదెరువు కోసం వలస వచ్చి వీ లానగర్ ప్రాంతంలోని వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్నాయి.

ఈ క్రమంలోనే సుష్మిత, దుర్గారావుకు మధ్య పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త ప్రేమగా మారింది. తాజాగా తమ ఇళ్లలో పెళ్లి ప్రస్తావన తీసుకురాగా.. ఇరు కుటుంబాలు ఒప్పుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన వారు ఓ అపార్ట్ మెంట్ పైనుంచి దూకేశారు. ఈ దుర్ఘటనలో దుర్గారావు, సుష్మిత అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు.

మృతులు ఇరువురి మధ్య వాగ్వాదం జరిగినట్టు గుర్తించిన పోలీసులు, ఇంట్లో గాజు గ్లాస్, టీవీ రిమోర్ట్ పగిలిపోవడం పోలీసులు గుర్తించారు. మృతురాలు సాయి సుష్మిత కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. మృతుడు ఫోన్ లాక్ అవ్వడంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే పీడీ యాక్ట్ : మంత్రి నాదెండ్ల

అమరావతి, డిసెంబర్ 3:ఏపీలోని పోర్టుల నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను వ్యవస్థీకృత నేరంగా పరిగణించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక నుంచి ఎవరైనా పీడీఎన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

ఇవాళ సచివాలయంలో పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన మంత్రులు అచ్చెన్నాయుడు, సత్య కుమార్ యాదవ్, ఉన్నతాధికారులతో సమీక్ష చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా, కాకినాడ పోర్టు వ్యవహారంపై చర్చించారు. ఈ సందర్భంగా.. ఏపీలోని పోర్టుల నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాను వ్యవస్థీకృత నేరంగా పరిగణించాలని కేబినెట్ సమావేశం నిర్ణయించింది. ఇక నుంచి ఎవరైనా పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. గోదాముల్లో యంత్రాలను ఎలా ఏర్పాటు చేశారని రాష్ట్ర మంత్రులు మారిటైమ్ బోర్డు, కాకినాడ పోర్టు అధికారులను ప్రశ్నించారు.

సార్టెక్స్ యంత్రాలను ఏర్పాటుపై విచారణ చేపట్టాలని, అందుకు బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా కాకినాడ పోర్టు భద్రతకు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ను నియమించాలని నిర్ణయించారు. కాకినాడ పోర్ట్, పరిసర ప్రాంతాలలో రవాణా కార్యకలాపాలు ఉక్కుపాదం మోపనున్నారు.

ఆహ్వానం

అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ తెలంగాణ శాఖ
జాతీయ అవార్డు గ్రహీతల అభినందన సభ

తేదీ : 05.12.2024 గురువారం సాయంత్రం 5.30ని॥,
వేదిక : అశోక్ నగర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్కృతి కేంద్రం , హైదరాబాద్ .

ముఖ్య అతిథి : గౌ॥ శ్రీ డాక్టర్ వెలుదండ నిత్యానంద రావు గారు
(ప్రెస్ కౌన్సిలర్ శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం)
విశిష్ట అతిథి: శ్రీ బైసా దేవదాసు గారు
(ఎడిటర్ నేటి నిజం దిన పత్రిక)
ఆత్మీయ అతిథి: శ్రీ డా॥ పులివర్తి కృష్ణమూర్తి గారు
(ఆధ్యాత్మిక వేత్త ,విమర్శకులు, రచయిత)
సభా అధ్యక్షులు : ఆచార్య కడారి సత్యమూర్తి గారు
(అధ్యక్షులు ABBSS – తెలంగాణ శాఖ)
సభా ప్రారంభం : తంగిరాల చక్రవర్తి గారు
(కార్యదర్శి ABBSS – తెలంగాణ శాఖ)
కవి సమ్మేళనం సభా నిర్వహణ : శ్రీమతి గోళ్లమూడి పద్మావతి గారు
(అధ్యక్షురాలు ABBSS – మహిళా విభాగం తెలంగాణ శాఖ)

జాతీయ అవార్డు గ్రహీతలు :
సరస్వతి సమ్మాన్ ఆచార్య డా॥ కసిరెడ్డి వెంకట రెడ్డి గారు
సరస్వతి సమ్మాన్ శ్రీ N. గోపాల కృష్ణ గారు
భారత్ భాషా భూషణ్ శ్రీ కూర బిదంబరం గారు
భారత్ భాషా భూషణ్ శ్రీ డా ॥ కర్నాటి లింగయ్య గారు
సంస్కృతి భూషణ్ శ్రీ కొండూరి కాశీ విశ్వేశ్వరరావు గారు
సంస్కృతి భూషణ్ శ్రీ ఆచార్య సుదర్శనం వేణు గోపాలా చార్య గారు
సాహిత్య శ్రీ శ్రీ కోరుపోలు మాధవ రావు గారు
సాహిత్య శ్రీ శ్రీమతి K.V.N.L ప్రసన్న కుమారి గారు
సాహిత్య శ్రీ D. శ్రీనాథ్ గౌడ్ గారు
సాహిత్య శ్రీ శ్రీ బండారు పల్లి రామచంద్ర రావు గారు
సాహిత్య శ్రీ శ్రీ వైరాగ్యం ప్రభాకర్ గారు

అందరూ ఆహ్వానితులే

T. చక్రవర్తి
ABBSS కార్యదర్శి
సెల్ : 9393804472, 9849320610

బిఆర్ఎస్ నేత హరీశ్ రావు పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో కేసు

హైదరాబాద్ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత హరీశ్ రావు పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదయింది. సిద్దిపేటకు చెందిన చక్రధర్ ఫిర్యాదు కేసు నమోదయింది. హరీశ్ రావు తో పాటు నాటి టాస్క్ ఫోర్స్ డిజి.రాధా కిషన్ రావు పైన కేసు నమోదయింది. తన ఫోన్ ను ట్యాపింగ్ చేశారని, అక్రమ కేసులు పెట్టి వేధించారని చక్రధర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో హరీశ్ రావు మీద 120(బి), 386, 409,506, రెడ్ విత్ 34, ఐటి చట్టం కింద కేసు నమోదు చేశార

2024 ఏడాదికి గాను దివ్యాంగుల సాధికారతకు కృషి చేసిన వారికి జాతీయ పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ, డిసెంబర్ 3:అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా 2024 ఏడాదికి గాను దివ్యాంగుల సాధికారతకు కృషి చేసిన వారికి జాతీయ పురస్కారాలను శ్రీమతి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ రోజు (డిసెంబర్ 3, 2024) న్యూఢిల్లీలో అందజేశారు.

ఈ సందర్భంగా పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలియజేస్తూ.. ఈ అవార్డులకు సామాజిక ప్రాధాన్యం ఉందని రాష్ట్రపతి అన్నారు. ఇతర వ్యక్తులు, సంస్థలు వారిని అనుసరించడం ద్వారా దివ్యాంగులను సాధికారత దిశగా ముందుకు నడిపించవచ్చన్నారు.

ఈ ఏడాది ఇతివృత్తమైన 'సమ్మిళిత, సుస్థిర భవిష్యత్తు కోసం దివ్యాంగుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం' గురించి ప్రస్తావిస్తూ దివ్యాంగ జనులను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించడం, నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, ఉపాధి కల్పించడం, వారు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయడం, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం ద్వారా వారిలో నాయకత్వ సామర్థ్యం పెరుగుతుందని రాష్ట్రపతి అన్నారు.

అందరితోనూ సమానమేనన్న భావన దివ్యాంగులకు కలిగేలా, వారు సౌకర్యవంతంగా ఉండేలా సమస్త మానవాళి కృషి చేయాలని రాష్ట్రపతి అన్నారు. ఎలాంటి అవరోధాలూ లేని వాతావరణాన్ని వారికి అందించడమే సమాజ ప్రాధాన్యం కావాలని సూచించారు. వాస్తవానికి దివ్యాంగులకు సమాన అవకాశాలూ సౌకర్యాలూ కల్పించిన సమాజాన్నే మేలైన సమాజంగా పిలుస్తారు.

వైకల్యమంటే అది ఏరకమైన లోపమూ కాదని, అది ఒక ప్రత్యేకమైన పరిస్థితి అని రాష్ట్రపతి చెప్పారు. "దివ్యాంగులకు కావాల్సింది సహానుభూతి... సానుభూతి కాదు. వారి పట్ల జాలితో వ్యవహరించడం కాదు.. గౌరవంతో ఉండటం అవసరం. వారిని భిన్నంగా చూడాల్సిన పని లేదు. ఆప్యాయత చూపిస్తే చాలు. ఇతరుల నుంచి సమానత్వం, మర్యాద, గౌరవం వారికి అందేలా సమాజం బాధ్యత వహించాలి" అని రాష్ట్రపతి అన్నారు. "అందరిలానే పని చేసే అవకాశం లభించినపుడు.. దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం, అర్థవంతమైన జీవితాన్ని గడుపుతున్నామన్న భావన కలుగుతుంది. ఉద్యోగం, వ్యాపారం, ఆర్థిక సాధికారత ద్వారా వారి జీవితాలు మెరుగవుతాయి" అని రాష్ట్రపతి అన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం విశేష కృషి చేస్తుంది- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, డిసెంబర్ 3: మెదక్ పట్టణ. మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు 50 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహణ. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ చంద్రపాల్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ సంధ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ నవీన్, మెడికల్ ఆఫీసర్స్ తో కలిసి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో ప్రజా పాలన ...ప్రజా విజయోత్సవాల మున్సిపల్ కార్మికులకు ఆరోగ్య పరీక్షల కార్యక్రమాలు విజయవంతంగా నిర్వయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తి అయిన సందర్భంగా జిల్లాలో ప్రజాపాలన... ప్రజా విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కు . ఇలాంటి కార్యక్రమాలు జిల్లాలో మరింతగా నిర్వహించి, ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు., ఈ క్రమంలోనే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని 5 లక్షల నుండి 10 లక్షలకు పెంచి కార్పోరేట్ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. అనంతరం మెదక్ మున్సిపాలిటీలో శానిటేషన్ వర్కర్లకు ఆరోగ్య పరీక్షలు లో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ చంద్రపాల్ బ్లడ్ శాంపిల్ తో టెస్ట్స్ చేయించుకున్నారు. . మున్సిపాలిటీలో 150 మంది పారిశుద్ధ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని వారందరికీ 50 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఏదేని అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించిన కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.

అమరావతి నిర్మాణానికి భారీ విరాళం..

అమరావతి, డిసెంబర్ 3:రాజధాని అమరావతికి విరాళాల వెల్లువ కొనసాగుతోంది. రాజధాని అమరావతి నిర్మాణం కోసం ఇప్పటికే పలువురు స్వచ్ఛందంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విరాళాలు అందించగా.. తాజాగా, కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఇందుపల్లికి చెందిన పి.విజయలక్ష్మి రూ.కోటి విరాళంగా ఇచ్చారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఆయన ఈ మేరకు చెక్కును అందించారు.

ప్రస్తుతం హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో నివాసం ఉంటున్న విజయలక్ష్మి తమకున్న కొద్దిపాటి భూమిని అమ్మి తన తల్లి కోరిక నెరవేర్చేందుకు ఈ విరాళం ఇస్తున్నట్లు ఆమే తెలిపారు.

పి.విజయలక్ష్మి త్యాగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా అభినందించారు. రాజధాని నిర్మాణం కోసం ఇచ్చిన విరాళం చిరస్థాయిగా నిలుస్తుందన్నారు.

బద్ది పోచమ్మ అమ్మవారికి బోనాల జాతర

.. వేలాదిగా తరలివచ్చిన మహిళలు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 3: (నేటినిజం ప్రతినిధి): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ దేవాలయమైన బద్దిపోచమ్మ అమ్మవారికి మంగళవారం బోనాల జాతర కొనసాగింది. సోమవారం శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు మంగళవారం ఉదయం బద్దిపోచమ్మ అమ్మవారికి బోనాలు చెల్లించుకోవడం ఆనవాయితీ.

ఇందులో భాగంగానే భక్తులు నెత్తిన బోనాలు ఎత్తుకొని డప్పు చప్పుళ్ళు, మేళ తాళాలు, నృత్యాలు చేస్తూ బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం శోభిల్లింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్చార్జి ఈవో వినోద్ రెడ్డి తెలిపారు.

ఏబివిపి ఎస్పిఐటి కాలేజీ ప్రెసిడెంట్ గా రుద్రాంగి నిఖిల్

హైదరాబాద్ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అఖిల భారత విద్యార్థి పరిషత్ కూకట్పల్లి విభాగ్ నికింద్రాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ప్యారడైస్ టౌన్ లోని స్వామి వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కాలేజ్ కాలేజీ కమిటీ ప్రకటించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ బాలకృష్ణ హాజరైనారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ కమిటీలో ఉన్న విద్యార్థి నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. కాలేజీలో ఉన్న సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుండాలని సూచించారు. కాలేజీ ప్రెసిడెంట్ గా నియమితులైన రుద్రాంగి నిఖిల్ మాట్లాడుతూ ఏబీవీపీ లో తనవంతుగా చేసిన కృషిని, వివిధ కార్యక్రమాలను గుర్తించి ప్రెసిడెంట్ గా బాధ్యతలు ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు... పెరిగిన బాధ్యతకు అనుగుణంగా ఏబీవీపీ కార్యక్రమాలను కాలేజీలో మరింత ముందుకు తీసుకెళ్తానని రుద్రంగి నిఖిల్ తెలిపారు.

దేశంలో తగ్గిన బంగారం ధరలు..

హైదరాబాద్ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);దేశంలోని ప్రజలందరూ పండగలు, పెళ్ళిళ్ళు అంటూ అనేక సందర్భాల్లో బంగారం కొనుగోలు చేస్తూనే ఉంటారు. ధర ఎంత అయినా ఉండని సందర్భాన్ని బట్టి కొనుగోలు చేస్తారు. అయితే బంగారం ధరలు స్థిరంగా అసలు ఉండవు. ధరలు రోజురోజుకి పెరుగుతూనే ఉంటాయి. ఒకసారి ధరలు పెరుగుతే మరోసారి తగ్గుతాయి. ఈ క్రమంలో బంగారం కొనడానికి ప్రజలు వెనకడుతారు. ఈరోజు అనగా డిసెంబర్ 3వ తేదీ మంగళవారం నాడు దేశ వ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లో, తెలుగు రాష్ట్రాల్లో బంగారం తాజా ధరలు :ఢిల్లీ..22 క్యారెట్ల పసిడి ధర రూ.71,040..24 క్యారెట్ల ధర రూ.77,490,..ముంబై..22 క్యారెట్ల ధర రూ.70,890..24 క్యారెట్ల ధర రూ.77,340,..చెన్నై...22 క్యారెట్ల రేట్ రూ.70,890,..24 క్యారెట్లు రూ.77,340,...బెంగళూరు..22 క్యారెట్ల ధర రూ.70,890...24 క్యారెట్ల ధర రూ.77,340,..తెలుగు రాష్ట్రాల్లో ...హైదరాబాద్..22 క్యారెట్ల ధర రూ.70,890,..24 క్యారెట్ల ధర రూ.77,340,..విశాఖపట్నం...22 క్యారెట్ల ధర రూ.70,890,..24 క్యారెట్ల ధర రూ.77,340,..విజయవాడ;..22 క్యారెట్ల ధర రూ.70,89024 క్యారెట్ల ధర రూ.77,340.

బయో డీజిల్ దుర్వాసనను అరికట్టాలి : సిపిఐ

నల్గొండ, డిసెంబర్3: గత సంవత్సర కాలంగా మీ కంపెనీ ద్వారా వస్తున్న దుర్వాసనను తగ్గించాలని కోరుతూ సిపిఐ మండల శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గత సంవత్సరం డిసెంబర్ మాసంలో దుర్వాసన తగ్గించి కంపెనీ కొనసాగించాలని వినతిపత్రం ఇచ్చినా వాసన తగ్గించకపోగా దుర్వాసన ఎక్కువై వాంతులు, విరేచనాలు, దగ్గు, జలుబు తదితర రోగాల బారిన పడి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, పొట్టు, బూడిద, ఇండ్ల మీద పడడంతో బట్టలు ఆరవేసుకుంటే నల్లటి బూడిద ద్వారా బట్టలు పాడవుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, తక్షణమే దుర్వాసన అరికట్టి ప్రజలకు మేలు జరిగే విధంగా చూడాలని కంపెనీ యాజమాన్యాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగొని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, కలకొండ సంజీవ, సూరపల్లి జనార్ధన్, గడ్డం యాదగిరి, సిపిఐ గ్రామ శాఖ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో అద్భుత విజయాలు సాధించాం.. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

-ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరుతాం..

-సీఎం సభను విజయవంతం చేయాలి..

-ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

పెద్దపల్లి, డిసెంబర్ 3 : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కాలంగా అద్భుత విజయాలు సాధించామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. పెద్దపల్లిలో స్థానిక ఎమ్మెల్యే

విజయరమణారావు, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి పెద్దపల్లిలో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. పెద్దపల్లిలో రేపు జరిగే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారని తెలిపారు. యువశక్తి విజయోత్సవ సభకు పెద్ద సంఖ్యలో అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణంపై సీఎం స్పష్టమైన ప్రకటన చేస్తారని తెలిపారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ బైపాస్ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన, జిల్లా కేంద్రంలో మహిళా శక్తి ప్రాంగణం, జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. పెద్దపల్లి ఆర్టీసీ బస్ డిపోతోపాటు ఆర్‌అండ్‌బీ, పీఆర్, రోడ్లు, వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తారని వివరించారు

కరెంట్ షాక్‌తో మహిళ మృతి

మహబూబ్‌నగర్, డిసెంబర్3: ఇంటి ఆవరణలో ఉడుస్తుండగా ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్ తగిలి మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషాదకర ఘటన మంగళవారం గోపాల్ పేట మండలం మున్ననూరు గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలం మున్ననూర్ గ్రామానికి చెందిన ఎరుకలి యాదమ్మ (36) మంగళవారం తన ఇంటి ముందు వాకిలి ఉడుస్తుండగా.. విద్యుత్ వైర్లు తగిలి కింద పడిపోయింది.

గమనించిన స్థానికులు దవాఖానకు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలికి భర్త సాయిలు గత మూడేళ్ల క్రితం అప్పుల బాధతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉన్న ఇద్దరు కుమారుల్లో పెద్ద కుమారుడు ఎలక్ట్రీషియన్ కూలిగా పని చేస్తుండగా? చిన్న కుమారుడు గొర్ల కాపరుల వద్ద జీతం చేస్తున్నాడు. తల్లీ మృతితో కుమారులిద్దరూ అనాథలైయ్యారు.

లక్ష కేసులు పెట్టినా.. ప్రజల పక్షాన నా పోరాటం ఆగదు -హరీశ్ రావు

హైదరాబాద్, డిసెంబర్ 3: మిస్టర్ రేవంత్ రెడ్డి అడుగడుగునా నువ్వు చేస్తున్న అన్యాయాలను నిలదీస్తున్నందుకు, నీ నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నందుకు, ప్రజల పక్షాన నీ మీద ప్రశ్నలు సంధిస్తున్నందుకు భరించలేక, సహించలేక నామీద అక్రమ కేసులెన్నో బనాయిస్తున్నావని మండిపడ్డారు బిఆర్ ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు. నీకు చేతనైంది ఒక్కటే.. తప్పు చేసి దబాయించడం, తప్పుడు కేసులు బనాయించడమని విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ ఖాతాలో ట్విట్ చేశారు..

రుణమాఫీ విషయంలో దేవుళ్లను సైతం దగా చేసినవు అని అన్నందుకు యాదగిరి గుట్ట పోలీసు స్టేషన్‌లో తనపై తప్పుడు కేసు పెట్టించారని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. ఇచ్చిన హామీలను ఎగవేస్తున్న నిన్ను ఎగవేతల రేవంత్ రెడ్డి అని అన్నందుకు బేగం బజార్ పోలీసు స్టేషన్‌లో , సోషల్ మీడియాలో ఎవరో పెట్టిన పోస్టుకు సైబర్ క్రైం పోలీసు స్టేషన్ లో , పార్టీ కార్యక్రమంలో మాట్లాడితే కోడిగుడ్డుమీద ఈకలు పీకి, తలాతోక లేని కేసొకటి మానకొండూరులో తనపై కేసులు పెట్టారని వివరించారు..

నీ రెండు నాల్కల వైఖరిని బట్టబయలు చేసినందుకు, ప్రజాక్షేత్రంలో నిలదీసినందుకు తట్టుకోలేక ఇవాళ పంజాగుట్ట స్టేషన్‌లో మరో తప్పుడు కేసు పెట్టించారని తెలిపారు. నువ్వు లక్ష తప్పుడు కేసులు పెట్టించినా, నేను ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపనని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రజా కోర్టులో, ప్రజా తీర్పుతో నీకు తగిన శిక్ష పడేంత వరకు ఆగనని తెలిపారు.

శబ్దం చేస్తే తాటతీస్తాం.. ఎస్పీ అఖిల్ మహాజన్

కరీంనగర్, డిసెంబర్ 3 రవాణా శాఖ నిబంధనలు ఉల్లంఘించి శబ్దం చేస్తే తాటతీస్తానని సిరిసిల్ల రాజన్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆకస్మిక వాహనాల తనిఖీ చేపట్టి ద్విచక్ర వాహనాలకు నిబంధనలు ఉల్లంఘించి బిగించిన సైలెన్సర్లను ఊడదీయించి బుల్లోజర్లతో ధ్వంసం చేయించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత ఇష్టానుసారంగా తమ ద్విచక్ర వాహనాలకు ఆదనపు సైలెన్సర్లు బిగించి శబ్ద కాలుష్యానికి పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రోజురోజుకు సౌండ్ పొల్యూషన్ అధికమవుతుందని, ఇకపై తరచూ తనిఖీలు నిర్వహించి బుల్డోజర్ ట్రీట్ మెంట్ అందిస్తామని హెచ్చరించారు. వాహనదారులు శబ్ద కాలుష్యాన్ని సృష్టించే సైలెన్సర్లను వెంటనే తీసివేయాలని, లేకపోతే తమదైన స్టైల్ లో ట్రీట్ మెంట్ అందిస్తామన్నారు.

తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘము, చెన్నై-11
జనని (సాంఘిక, సాంస్కృతిక సమితి), చెన్నై-118

సంయుక్త నిర్వహణలో
అమర గాయకుడు
ఘంటసాల 102వ జయంతి
తేది, సమయం :
04-12-2024 బుధవారం, సా॥ 5.30 గంటలకు
వేదిక :
శ్రీ ముక్కాలనమ్మాళ్వార్-శ్రేష్ఠి గారి ఆడిటోరియం,
డి.ఆర్.బి.సి.సి.సి. మహిళా పాఠశాల,
(పెరంబూరు రైల్వే స్టేషన్ దగ్గర), పెరంబూరు, చెన్నై - 11.
ప్రార్థన : శ్రీమతి నిడమర్తి వసుంధరాదేవి
స్వాగతం : శ్రీ గుడిమెట్ల చెన్నయ్య (ప్రధాన కార్యదర్శి, జనని, చెన్నై)
అధ్యక్షత : డాక్టర్ నిర్మలా పఠనివేలు (అధ్యక్షులు, జనని, చెన్నై)
వక్తలు : శ్రీ తమ్మినేని బాబు (అధ్యక్షులు, తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం, చెన్నై)
శ్రీ వంజరపు శివయ్య (విశ్రాంత జనరల్ మేనేజర్, రిపోస్బాంక్, చెన్నై)
శ్రీ ఎం.ఆర్. సుబ్రహ్మణ్యం (గాయకులు)
శ్రీమతి పెద్దాడ సాయి సూర్య సుబ్బలక్ష్మి (ఆకాశవాణి, చెన్నై కేంద్రం)
వందన సమర్పణ : శ్రీ ఎస్.వి.వి. సారథి
కార్యక్రమ నిర్వహణ : శ్రీ పి.ఆర్. కేశవులు (కార్యదర్శి, తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం, చెన్నై)
ప్రత్యేక కార్యక్రమం
శ్రీ ఎం.ఆర్. సుబ్రహ్మణ్యం బృందం వారిచే సంగీత విభావరి
అందరూ ఆహ్వానితులే

మలిదశ పోరాటానికి ఊపిరి శ్రీకాంతాచారి : నీలం మధు ముదిరాజ్

మెదక్, డిసెంబర్ 3: మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన ఆత్మబలిదానంతో ఊపిరులూది ఉద్యమం ఎగిసేలా చేసిన మహనీయుడు శ్రీకాంతాచారి అని మెదక్ కాంగ్రెస్ సీనియర్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. మంగళవారం శ్రీకాంతాచారి వర్ధంతిని పురస్కరించుకొని చిట్కుల్లోని ఎన్ఎంఆర్ క్యాంప్ కార్యాలయంలో శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ? తెలంగాణ ఉద్యమం సాగుతున్న సమయంలో ఉద్యమాన్ని అణచడానికి అప్పటి సమైక్యాంధ్ర పాలకులు సన్నాహాలు చేస్తున్న తరుణంలో తన ఆత్మబలిదానంతో ఉద్యమం నిలబడాలని పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని జై తెలంగాణ నినాదాలతో ఉద్యమకారుల్లో స్ఫూర్తినింపారని కొనియాడారు.

ఆనాడు ఆ మహనీయుడు ఆత్మబలిదానంతో తెలంగాణ సమాజమంతా ఉవ్వెత్తున ముందుకు కదలి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఉద్యమకారుల కుటుంబాలను రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి గౌరవిస్తుందన్నారు.

టూకే రన్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

హైదరాబాద్ ,డిసెంబర్ 3: ప్రజాపాలన ఉత్సవాల సందర్భంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో 2కే రన్ నిర్వహించారు.

వికారాబాద్ జిల్లా కలెక్టర్ పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని వికారాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ చిగులపల్లి మంజుల రమేష్ జెండా ఊపి ప్రారంభించారు.

నిన్నేపల్లి చౌరస్తా నుండి వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా వరకు ఈ టూకే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన సంక్షేమ అధికారి హనుమంతరావు, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చిగులపల్లి రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా 25వ హార్న్‌బిల్ ఫెస్టివల్ సందర్భంగా కొహిమాలోని కిసామాలో "నాగా-ల్యాండ్ & పీపుల్ ఇన్ ఆర్కైవల్ మిర్రర్" ప్రదర్శన

న్యూఢిల్లీ, డిసెంబర్ 3:నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా (ఐఎ), నాగాలాండ్ ప్రభుత్వంలోని ఆర్ట్స్ అండ్ కల్చర్ డిపార్ట్‌మెంట్ సహకారంతో, 1 డిసెంబర్ 2024న ప్రారంభమైన 25వ హార్న్‌బిల్ ఫెస్టివల్‌లో భాగంగా "నాగా – ల్యాండ్ ఉ పీపుల్ ఇన్ ఆర్కైవల్ మిర్రర్" ప్రదర్శనను ఏర్పాటు చేసింది. , 2వ ప్రపంచ యుద్ధం మ్యూజియం కాంప్లెక్స్, కిసామా, కొహిమా.నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా మరియు నాగాలాండ్ స్టేట్ ఆర్కైవ్స్ సేకరణలోని చారిత్రక ఆర్కైవల్ రికార్డులు మరియు ఛాయాచిత్రాల ఆధారంగా, ఈ ప్రదర్శన నాగాలాండ్ యొక్క గొప్ప చరిత్ర, సంస్కృతి మరియు వారసత్వం యొక్క విశేషమైన అన్వేషణను అందిస్తుంది.

విశిష్ట ప్రముఖులు మరియు సాంస్కృతిక ఔత్సాహికుల సమక్షంలో నాగాలాండ్ ప్రభుత్వ ఆర్ట్ ఉ కల్చర్ సలహాదారు శ్రీ కె. కొంగమ్ కోనాయక్ ఈ ప్రదర్శనను ప్రారంభించారు. డిసెంబర్ 1 నుండి 10, 2024 వరకు నడుస్తుంది, ఈ ఎగ్జిబిషన్ 12 నేపథ్య ప్యానెల్‌ల చుట్టూ రూపొందించబడింది, వీటిలో ప్రతి ఒక్కటి నాగాలాండ్ చరిత్రలో ముఖ్యమైన క్షణాల గురించి అంతర్దృష్టులను అందిస్తుంది, వీటిలో:

ఎగ్జిబిషన్ మ్యాప్‌లు, ఛాయాచిత్రాలు మరియు పత్రాలతో సహా అరుదైన ఆర్కైవల్ మెటీరియల్‌లను ప్రదర్శిస్తుంది మరియు శాంతి మిషన్‌లు, 1963 అసెంబ్లీ ఎన్నికల వంటి ప్రజాస్వామ్య మైలురాళ్లు, రాజకీయ ఉద్యమాలు మరియు డా. ఎస్. రాధాకృష్ణన్ మరియు గౌరవనీయుల వంటి నాయకుల చారిత్రక సందర్శనల వంటి కీలక కథనాలను హైలైట్ చేస్తుంది. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ. ఈ ఆర్కైవల్ సంపదలను అన్వేషించడం ద్వారా, సందర్శకులు రాష్ట్ర సంప్రదాయాలు, చరిత్ర మరియు సాంస్కృతిక పరిణామంపై లోతైన అవగాహన పొందుతారు.

పెళ్లి పీటలపై నుంచి మాటిమాటికి బాత్రూమ్‌కు పెళ్లికొడుకు.. విషయం తెలిసి వధువు కుటుంబం షాక్..!

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: అక్కడ అంగరంగవైభవంగా పెళ్లి జరుగుతోంది..! పెళ్లికూతురు, పెళ్లికొడుకు వేదికపై పెళ్లిపీటల మీద కూర్చుని ఉన్నారు..! ఇరువురి కుటుంబాల సమక్షంలో పెళ్లి తంతు కొనసాగుతోంది..! బంధుమిత్రులంతా వేదిక ముందు ఆసీనులై పెళ్లి వేడుకను వీక్షిస్తున్నారు..! అంతా సజావుగా సాగుతున్న సమయంలో పెళ్లి కొడుకు చేసిన పని ఆ పెళ్లి రద్దుకు దారితీసింది. దేశ రాజధాని ఢిల్లీలోని సాహిబాబాద్ ఏరియాలో ఈ ఘటన చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే.. పెళ్లి వేడుకలో భాగంగా వధూవరులిద్దరూ వేదికపైకి వచ్చారు. ఒకరికొకరు పూలదండలు వేసుకున్నారు. ఆ తర్వాత పెళ్లిపీటల మీద ఆసీనులపై పురోహితుడి సూచనల ప్రకారం పెళ్లి తంతును కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో పెళ్లికొడుకు వాష్‌రూమ్‌కు అని చెప్పి వెళ్లాడు. ఆ తర్వాత తిరిగొచ్చి కాసేపటికి మళ్లీ వాష్‌రూమ్‌కు అని చెప్పి వెళ్లిపోయాడు. మళ్లీమళ్లీ అలాగే వెళ్తుండటంతో పెళ్లి కూతురుకు అనుమానం వచ్చింది.

మాటిమాటికి వాష్‌రూమ్‌కు ఎందుకు వెళ్తున్నాడో కనిపెట్టండి అంటూ తన కుటుంబీకులకు కనుసైగ చేసింది. దాంతో పెళ్లికొడుకు చేస్తున్న పని తెలుసుకుని వధువు కుటుంబీకులు ఖంగుతిన్నారు. వాష్‌రూమ్ పేరు చెప్పి పెళ్లి కొడుకు వేదిక వెనుకాల స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తున్నాడు. విషయం తెలుసుకున్న పెళ్లి కూతురు అతడిని తాను పెళ్లి చేసుకోనని తేల్చి చెప్పింది. వరుడు వెడలో వేసిన పూలమాలను విసిరికొట్టింది.

దాంతో వధూవరుల కుటుంబాల మధ్య గొడవ మొదలైంది. ఒకరినొకరు దూషించుకోవడమేగాక కొట్టుకున్నారు. ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు ఇరు కుటుంబాలకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించేశారు. పెళ్లి రద్దయిపోయింది. శుభమా అంటూ పెళ్లి జరుగుతున్న వేళ పెళ్లికొడుకు చేసిన పిచ్చిపని తీవ్ర గందరగోళానికి దారితీసింది. పీటల మీదే పెళ్లి ఆగిపోవడానికి కారణమైంది.

మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీమతి అనా తబన్, భారతదేశంలోని మోల్డోవన్ రాయబారి డాక్టర్ దేవేష్ చతుర్వేది

ఎడఎఫ్‌డబ్ల్యు, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి శ్రీ ఫైజ్ అహ్మద్ కిద్వాయ్ మరియు అసిస్టెంట్ శ్రీమతి లూసియా గులాతీ కూడా పాల్గొన్నారు. మోల్డోవా రాయబార కార్యాలయం

న్యూఢిల్లీ, డిసెంబర్ 3:భారతదేశంలోని రిపబ్లిక్ ఆఫ్ మోల్డోవా రాయబారి శ్రీమతి అనా తబన్, న్యూ ఢిల్లీలోని కృషి భవన్‌లో వ్యవసాయ ఉ రైతుల సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ దేవేష్ చతుర్వేదిని మర్యాదపూర్వకంగా సందర్శించారు.

రాయబారిని స్వాగతిస్తూ, డాక్టర్ చతుర్వేది భారతదేశం మరియు మోల్డోవా మధ్య సత్సంబంధమైన ద్వైపాక్షిక సంబంధాలను నొక్కి చెప్పారు. నూనెగింజలు మరియు పప్పుధాన్యాలలో స్వయం సమృద్ధిని సాధించడం, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌ను ముందుకు తీసుకెళ్లడం మరియు రైతులకు సేవా డెలివరీని మెరుగుపరచడానికి విధానాలను అమలు చేయడంతో సహా వ్యవసాయ రంగంలో భారతదేశం యొక్క ముఖ్య ప్రాధాన్యతలను ఆయన హైలైట్ చేశారు. డాక్టర్ చతుర్వేది కూడా వ్యాధి-రహిత ఉద్యానవన మొక్కలను అందుబాటులో ఉండేలా క్లీన్ ప్లాంట్ ప్రోగ్రామ్ ఏర్పాటు గురించి, అలాగే సుస్థిరతను పెంపొందించే లక్ష్యంతో నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ గురించి మాట్లాడారు.రాయబారి అనా తబాన్ మోల్డోవా వ్యవసాయ రంగం యొక్క స్థూలదృష్టిని అందించారు, అది ఎదుర్కొంటున్న సవాళ్లను వివరిస్తుంది. ఆమె అనేక దేశాలతో మోల్డోవా యొక్క బలమైన ఉచిత వాణిజ్య ఒప్పందాల (ఈటలు) నెట్‌వర్క్‌ను కూడా హైలైట్ చేసింది, వాణిజ్యానికి సంభావ్య మార్కెట్ అవకాశాలను నొక్కి చెప్పింది. అవగాహన ఒప్పందం ద్వారా జాయింట్ వర్కింగ్ గ్రూప్ (ఏచిఉ) ఏర్పాటు ఆమోదం స్థితి మరియు ముందస్తు అనుకూలమైన పరిశీలన కోసం సెక్రటరీ, ఇఉఈచితో యాపిల్స్ మార్కెట్ యాక్సెస్ గురించి కూడా రాయబారి చర్చించారు.

ఎమ్ఒయు సంతకం తర్వాత సహకారం కోసం సంభావ్య ప్రాంతాలను హైలైట్ చేస్తూ, జాయింట్ సెక్రటరీ (అంతర్జాతీయ సహకారం), ఇఉఈచి, వ్యవసాయ విశ్వవిద్యాలయాలతో జ్ఞాన- భాగ్యం, సాంకేతికత బదిలీ, పరిశోధన మరియు అభివృద్ధి సహకారం మరియు భారతదేశం మధ్య వ్యవసాయ పరికరాలలో వాణిజ్యానికి అవకాశాలను నొక్కిచెప్పారు. మరియు మోల్డోవా.

ఈ సమావేశానికి అదనపు కార్యదర్శి (పిపి), జాయింట్ సెక్రటరీ (ఐసి), జాయింట్ సెక్రటరీ (పిపి),

తేనె, తులసి, వేపాకులను రోజూ తింటే.. ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా..?

హైదరాబాద్, డిసెంబర్ 3: చలికాలంలో చాలా మందికి సహజంగానే రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో దగ్గు, జలుబు వంటి శ్వాసకోశ సమస్యలు ఇబ్బందులకు గురి చేస్తుంటాయి. ఇలాంటి సమయంలో రోగ నిరోధక శక్తిని పెంచుకోవాల్సి ఉంటుంది. దీంతో సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే చలికాలంలో చర్మం పగులుతుంది కనుక చర్మాన్ని సంరక్షించుకోవాల్సి ఉంటుంది. అయితే ఇందుకు ఖరీదైన క్రీములు వాడాల్సిన పనిలేదు. పలు ఆహారాలను రోజూ ఉదయాన్నే తీసుకుంటే చాలు చర్మానికి సంరక్షణ లభిస్తుంది. అలాగే పలు ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు. ఇక ఆ ఆహారాలు ఏమిటంటే.. తేనె, తులసి ఆకులు, వేప ఆకులు. ఈ మూడింటినీ మిశ్రమంలా చేసి ఈ సీజన్‌లో రోజూ ఉదయాన్నే తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

ఆయుర్వేద ప్రకారం తేనె, తులసి ఆకులు, వేపాకులు మనకు ఎంతగానో మేలు చేస్తాయి. ముఖ్యంగా చలికాలంలో రోజూ ఉదయం వీటిని తీసుకుంటే మనకు ఎంతో మేలు జరుగుతుంది. పలు రకాల వ్యాధులను తగ్గించుకోవచ్చు. నాలుగు తులసి ఆకులు, నాలుగు వేపాకులను తీసుకుని పేస్ట్‌లా చేసి అందులో కాస్త తేనె కలిపి ఉదయం పరగడుపున తీసుకోవాలి. ఈ విధంగా తీసుకుంటే ఎన్నో లాభాలు కలుగుతాయి. ఈ మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో చలికాలంలో వచ్చే శ్వాసకోశ సమస్యల నుంచి బయట పడవచ్చు. ముఖ్యంగా దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. ముక్కు దిబ్బడ పోతుంది. అలాగే గొంతు సమస్యలు తగ్గుతాయి. గొంతులో ఉండే నొప్పి, మంటతోపాటు గొంతులో ఉండే కఫం కూడా పోతుంది. ఊపిరితిత్తుల్లో ఉండే కఫం బయటకు వస్తుంది. దీంతో శ్వాస సరిగ్గా ఆడుతుంది.

ఈ మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. పలు ఇన్‌ఫెక్షన్లు, వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. ఈ మిశ్రమాన్ని తింటే జీర్ణక్రియ మెరుగు పడుతుంది. చలికాలంలో చాలా మందికి తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాదు. అజీర్ణ సమస్యతో బాధపడుతుంటారు. అలాంటి వారు రోజూ ఈ మిశ్రమాన్ని తీసుకుంటే ఎంతో ఫలితం ఉంటుంది. దీంతో తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం, మలబద్ధకం ఉండవు. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది.

బైక్‌పై నుంచి దూసుకెళ్లిన టిప్పర్.. ట్యాంక్ పేలడంతో చెలరేగిన మంటలు..

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: మెదక్ జిల్లా తూప్రాన్‌లో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద బైక్‌ను ఓ టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకర్ తీవ్రంగా గాయపడ్డారు. దశరథ్ అనే వ్యక్తి బైక్‌పై మున్సిపల్ ఆఫీస్ వైపు వెళ్తున్నారు. అతని వెనకాలే ఓ టిప్పర్ వస్తున్నది. నర్సాపూర్ చౌరస్తా వద్ద టిప్పర్ ఎడమవైపు టర్న్ తీసుకుంటున్నది.

అయితే అదేనమయంలో స్ట్రెయిట్‌గా వెళ్తున్న బైక్‌ను గమనించకుండా టిప్పర్ డ్రైవర్ ఎడమవైపు మళ్లారు. దీంతో ద్విచక్ర వాహనంపైనుంచి లారీ వెళ్లిపోయింది. ఈ క్రమంలో బైక్ ట్యాంకర్ పేలడంతో మంటలు చెలరేగాయి.

అప్పటికే గాయపడిన దశరథ్‌కు మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేసి.. అతడిని దవాఖానకు తరలించారు. ఇదంతా సమీపంలో ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డయింది. ఈ యాక్సిడెంట్ ఎప్పుడు జరిగిందో తెలియనప్పటికీ.. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

బియ్యం అక్రమ రవాణాలో సంబంధం లేదు.. వైసీపీ నేతలకు ఏపీ మంత్రి పయ్యావుల కౌంటర్

అమరావతి, డిసెంబర్ 3: కాకినాడ పోర్టులో బియ్యం అక్రమ రవాణాపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన తనిఖీలు ఏపీలో రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. వైసీపీ నేతల బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని కూటమి నేతలు ఆరోపిస్తుంటే.. ఆర్థిక మంత్రి బియ్యంకుడే రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారని వైసీపీ నేతలు విమర్శిస్తున్నారు. ఇలా తన బియ్యంకుడిపై వస్తున్న ఆరోపణలపై ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పందించారు. రేషన్ బియ్యంతో తన బియ్యంకుడికి సంబంధం లేదని.. రైతుల దగ్గర ధాన్యం కొని.. మిల్లింగ్ చేసుకుని ఎగుమతి చేస్తారని స్పష్టం చేశారు.

తమ బియ్యంకుడి కుటుంబం మూడు తరాలుగా బాయిల్డ్ రైస్ ఎగుమతి వ్యాపారం చేస్తున్నారని పయ్యావుల కేశవ్ తెలిపారు. వాళ్ల కుటుంబం ముడి బియ్యం వ్యాపారం చేయదని.. కేవలం స్టీమ్ రైస్ మాత్రమే ఎగుమతి చేస్తుందని పేర్కొన్నారు. తనతో బియ్యం పొందాక ఆయన బియ్యం వ్యాపారం చేయడం లేదని చెప్పారు. రేషన్ బియ్యంతో తన బియ్యంకుడి వ్యాపారానికి సంబంధం లేదని వెల్లడించారు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి సొంత ఫ్యాక్టరీలో మిల్లింగ్ చేసుకుని ఎగుమతి చేస్తారని స్పష్టం చేశారు.

కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోనే తమ బియ్యంకుడు బియ్యం వ్యాపారం చేస్తున్నారని.. ఏపీలో గింజ కూడా కొనుగోలు చేయలేదని పయ్యావుల కేశవ్ అన్నారు. పేర్ని నాని, అంబటి రాంబాబుకు అనుమానం ఉంటే చెక్ పోస్టు దగ్గర ప్రతి బ్యాగ్ తనిఖీ చేసుకోవచ్చని సవాలు విసిరారు. ఆ తనిఖీలకు తానే అన్ని అనుమతులు ఇప్పిస్తానని కూడా చెప్పారు.

ఇంకా చలామణిలో రూ.6,839 కోట్ల విలువైన రూ.2000 నోట్లు

-రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడి

న్యూ డిల్లీ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్); ఇంకా రూ.6,839 కోట్ల విలువైన రూ.2000 నోట్లు చలామణిలో ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా ప్రకటించింది. 2023 మే 19న రూ.2000 నోట్లను చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. నాటి నుంచి నవంబర్‌లో వ్యాపారం ముగిసే సమయానికి చలామణి నుంచి దాదాపు 98.08 శాతం మేర రూ.2వేల నోట్లు తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చాయని తెలిపింది. ప్రస్తుతం రూ.6,839 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు ప్రజల వద్ద ఉన్నాయని, అవి రావాల్సి ఉందని స్పష్టం చేసింది.కాగా, 2023 మే 19న చలామణి నుంచి రూ.2,000 నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. నాడు చలామణిలో ఉన్న ఈ నోట్ల విలువ రూ.3.56 లక్షల కోట్లు. ఇదిలావుంటే నిరుడు అక్టోబర్ 7దాకా దేశంలోని అన్ని బ్యాంక్ శాఖల్లో రూ.2,000 నోట్ల మార్పిడి జరిగింది. ఆ తర్వాత నుంచి హైదరాబాద్‌తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్బీఐ కార్యాలయాల్లో మాత్రమే ఈ మార్పిడికి వీలుంది.అహ్మదాబాద్, బెంగళూరు, బేలాపూర్, భోపాల్, భువనేశ్వర్, చండీగఢ్, చెన్నై, గౌహతి, హైదరాబాద్, జైపూర్, జమ్మూ, కాన్పూర్, కోల్‌కతా, లక్నో, ముంబై, నాగ్‌పూర్, న్యూఢిల్లీ, పాట్నా, తిరువనంతపురంలోని ఆర్బీఐ శాఖల్లో రూ.2వేల నోట్లు మార్చుకోవచ్చు. కాగా, కేంద్ర ప్రభుత్వం నవంబర్ 2016లో రూ. 2000 నోట్లను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అప్పుడు చలామణిలో ఉన్న రూ. 1,000, రూ.500 నోట్లను రద్దు చేసి రూ.2వేల నోట్లను చలామణిలోకి తెచ్చింది.

భారీ వర్షాలు.. సాగునీటి సంఘాల ఎన్నికల వాయిదా

అమరావతి, డిసెంబర్ 3: తుపాను, భారీ వర్షాల కారణంగా ఏపీలో ఈనెల 5న జరగాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వాయిదాపై కలెక్టర్లకు సమాచారం పంపారు. తదుపరి నోటిఫికేషన్ జారీ తేదీని త్వరలో వెల్లడిస్తామని స్పష్టం చేశారు.సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీల ఎన్నికలకు ప్రభుత్వం కొన్ని రోజుల క్రితం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 6,149 సాగునీటి సంఘాలు , 245 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 53 ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్‌ను విడుదల చేసి ఓటరు జాబితాల రూపకల్పన, చేపట్టాల్సిన ప్రక్రియకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది.

బ్యాంకాక్‌లో ఇద్దరు తెలంగాణ వాసులు అదృశ్యం.. తమ భర్తల ఆచూకీ తెలుసుకోవాలని భార్యల వినతి

హైదరాబాద్, డిసెంబర్ 3: థాయిలాండ్‌లో ఇద్దరు తెలంగాణవాసులు అదృశ్యమయ్యారు. ఉద్యోగం కోసం విజిట్ వీసాపై బ్యాంకాక్‌కు వెళ్లిన ఇద్దరు అక్కడ కనిపించకుండా పోయారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ప్రవాసి ప్రజావాణిలో బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా షెట్‌పల్లికి చెందిన శనిగరపు అరవింద్, జగిత్యాల జిల్లా ఆత్మకూరుకు చెందిన కొండ సాగర్ విదేశాల్లో ఉద్యోగం కోసం ఒక ఏజెంట్‌ను ఆశ్రయించారు. వారి నుంచి రూ.2లక్షల చొప్పున వసూలు చేసిన సదరు ఏజెంట్ వారికి థాయిలాండ్‌కు విజిట్ వీసా ఇప్పించారు. దీంతో వారు నవంబర్ 11న ముంబై నుంచి బయల్దేరి బ్యాంకాక్‌కు వెళ్లారు. అయితే ఈ నెల 21 నుంచి వారిద్దరి నుంచి ఎలాంటి సమాచారం లేదు. వారి అదృశ్యంపై బాధితుల కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. దీంతో అరవింద్ భార్య జల, సాగర్ భార్య కాశమ్మ హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన ప్రవాసి ప్రజావాణికి వచ్చి ఫిర్యాదు చేశారు. థాయిలాండ్‌లో తప్పిపోయిన తమ వారి ఆచూకీని తెలుసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని వారు కోరారు. ఏజెంట్‌పై కూడా కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.



రోడ్డు నిర్మాణ పనుల కోసం ఆర్ అండ్ బి కార్యాలయాన్ని ముట్టడించిన బిజెపి...

-రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలి...

-బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్....

కరీంనగర్, డిసెంబర్ 3:(నేటినిజం ప్రతినిధి) కొత్తపల్లి హవేలీ నుండి వయ షా నగర్ మీదుగా గంగాధర మండల కేంద్రం

వరకు దాదాపు 10 గ్రామాలకు ఉపయోగపడే రోడ్డు నిర్మాణ పనుల పట్ల కాంట్రాక్టర్, అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్ యాదవ్ ప్రశ్నించారు. రామడుగు మండలం లోని రోడ్డు నిర్మాణ పనులు సత్వరం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ రామడుగు బీజేపీ మండల శాఖ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం రోజున కరీంనగర్లోని ఆర్ అండ్ బి ఎస్ . ఈ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. ముట్టడి సందర్భంగా పోలీసులు భారీగా మోహరించి బిజెపి శ్రేణులు ఎన్.ఈ కార్యాలయంలోకి వెళ్లకుండా ప్రధాన గేటును మూసివేశారు. దీంతో బిజెపి నాయకులు కార్యకర్తలు గేటు ఎదుటనే బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ షానగర్ నుండి మోతె,కొరటపెల్లి మీదుగా కొత్తపెల్లి వరకు పిడబ్ల్యుడి రోడ్డు నిర్మాణం కోసం గత మూడు సంవత్సరాల క్రితం 2.14 కోట్ల, తదనంతరం మరో 70 రూపాయలు మంజూరు అయిన ఇంతవరకు నిర్మాణ పనులు పూర్తి చేయలేదన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నారని, దీంతో ఆయా ప్రాంతాల మీదుగా ప్రయాణాలు కొనసాగించే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. , ముఖ్యంగా ఉన్న రోడ్డున తవ్వి గుంతల మయం చేసి, కంకర కుప్పలు ఇష్టం ఉన్నట్టు పోయడంతో వాహనదారులు , ప్రయాణికులు ప్రమాదాల బారిన పడ్డారన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వల్ల జరుగుతున్న ప్రమాదాలకు బాధ్యత ఎవరిదన్నారు...?ప్రమాద బాధితులకు ఎవరు భరోసా కల్పిస్తారని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. ముఖ్యంగా ఇక్కడి ప్రాంతంలో ప్రమాదాల గురైన బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని, బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయడానికి అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని కోరుతూ ఆర్ అండ్ బి ఈ.ఈ కి బిజెపి శ్రేణులు వినతి పత్రం సమర్పించగా ఆయన వెంటనే స్పందించి బుధవారం నుండి పనులు ప్రారంభించడానికి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు . ఇట్టి కార్యక్రమంలో రామడుగు శాఖ బిజెపి మండల అధ్యక్షుడు కరుణాకర్, జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్, మాజీ ఎంపీటీసీ సభ్యులు మోడీ రవీందర్, మండల ప్రధాన కార్యదర్శిలు పోచంపెల్లి నరేష్,పురేళ్ల శ్రీకాంత్ గౌడ్, మండల ఉపాధ్యక్షుడు వేముండ్ల కుమార్, శ్రీనివాస్ , ఉప్పు తిరుపతి, మేకల లక్ష్మణ్ , కనకయ్య, రవీందర్ మండల ఐటి సెల్ కన్వీనర్ మాడిశెట్టి జయంత్,బూత్ కమిటీ అధ్యక్షులు కడారి శ్రీనివాస్, వేముల శ్రీనివాస్, వేముల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో పతకాలు సాధించిన వారిని అభినందించిన కమిషనర్ ఆఫ్ పోలీస్

కరీంనగర్, డిసెంబర్ 3: ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమి ప్రతిష్టాత్మకంగా మహారాష్ట్రలోని పూణే పట్టణములో శ్రీ ఛత్రపతి స్పోర్ట్ స్టేడియంలో గత నెల 28 తేదీ నుండి ఈనెల 01 వరకు నిర్వహించిన 27 వ జాతీయస్థాయి కరాటే ఛాంపియన్ షిప్ లలో కరీంనగర్ ఒకినావా స్కూల్కు చెందిన పలువురు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని 19 పతకాలు సాధించినట్లు వీరిని మంగళవారం స్థానిక కమిషనర్ ఆఫ్ పోలీస్ అభిషేక్ మహంతి, ట్రేస్ ఐ.పి.ఎస్ . శ్రీ వసుంధర వారు కార్యాలయములో అభినందించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని నిరంతర సాధనతో ఇది సాధ్యమవుతుందని అన్నారు . గోల్డ్ 6 , సిల్వర్ 5, బ్రాంజ్ 8 మెడల్స్ సాధించినట్లు ఒకినావా సంస్థల చీఫ్ అఫీషియల్ కె . వసంత్ కుమార్ తెలిపారు . ఈ పోటీలకు కోచ్ కరీంనగర్ నుండి పుల్లూరి శ్రీనివాస్ , మేనేజర్ కె . రాజశేఖర్లు హాజరైనట్లు వసంత్ కుమార్ తెలిపారు .

ఛత్ పూజ ఇన్చార్జ్ లను ఘనంగా సన్మానించిన జన సేవా సంఘ్ స్టీరింగ్ కమిటీ

హైదరాబాద్ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);గతనెల హైదరాబాద్ నగరం తోపాటు సరిహద్దు ప్రాంతాల్లోని సుమారు 30 ఘాట్లలో నిర్వహించిన ఛత్ పూజ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించిన ఛత్ పూజ ఇన్చార్జ్ లతోపాటు ,కార్యకర్తలను జన సేవా సంఘ్ స్టీరింగ్ కమిటీ ఘన సన్మానించింది. ఈ సందర్భంగా జన్ సేవా సంఘం అధ్యక్షుడు ఆర్ పి సింగ్ మాట్లాడుతూ సంస్థ యొక్క ప్రేరణ మూలం, వి. కె. సింగ్, మాజీ జైళ్ల శాఖ డీ జి మరియు సెంట్రల్ కమిటీ నాయకత్వంలో, ఘాట్ ఇన్చార్జు మరియు నిర్వాహకులందరూ తమ సమర్థత, శ్రద్ధ, అంకితభావం మరియు పూర్తి అంకితభావంతో కష్టపడి పనిచేశారని కొనియాడారు. ఛత్ మహా పండుగ యొక్క గొప్ప పండుగను జరుపుకోవడానికి, ఛత్ పూజతో సంబంధం ఉన్న కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు చాలా సంతోషంగా మరియు గర్వపడుతున్నారు. ఈ పండుగను చిరస్మరణీయంగా మార్చేందుకు మహేశ్వరి కాంప్లెక్స్ సంస్థ ద్వారా సన్మాన కార్యక్రమం నిర్వహించబడిందని తెలిపారు. ఇందులో సెంట్రల్ కమిటీ, సంఘ్ స్టీరింగ్ కమిటీ, ఛత్ పూజ ఇన్చార్జ్ మరియు సంబంధిత కార్యకర్తలందరినీ సన్మానించారు. ఈ వేడుకలో, హాజరైన కార్మికులందరూ తమ ఉత్సాహంతో మరియు అద్భుతమైన ధైర్యం మరియు అంకితభావంతో పనిచేసినందుకు చాలా ప్రశంసించారు ఈ సన్మాన కార్యక్రమంలో జన్ సేవా సంఘం అధ్యక్షుడు ఆర్ పి సింగ్, ఉపాధ్యక్షుడు గోవింద్ తివారీ, ప్రధాన కార్యదర్శి రాజీవ్ చౌబే, కోశాధికారి బీనిత్ సింగ్, స్టీరింగ్ కమిటీ కన్వీనర్ మదన్ లాల్ రావల్, వి.డి.చౌబే, కె డి చౌబే, రాధే శ్యామ్ రాయ్ యాదవ్, ఎం. డి మునవ్వర్, ఎస్ పి సింగ్, సంజయ్ కుమార్ భగత్, దినేష్ చందన్, నారాయణ ఓఝా, నరేందర్ ప్రసాద్, రాజేష్ యాదవ్, సుబోధ్ కుమార్ సింగ్, బిపిన్ పాస్వాన్, దీపక్, ప్రిన్స్ కుమార్ భగత్, జయ్ ప్రకాష్, రుదల్ సాహనీ, రాజేందర్ సింగ్, శ్యామ్ రామా, రాకేష్ కుమార్, దీపక్ కుమార్, నందలాల్, కిషన్, రాజ్ కుమార్, దినేష్ చౌబే, సౌరభ్ తివారీ, రాహుల్ చౌబే, రాంశజన్, రాజేష్ శర్మ, వినోద్ కుమార్ జాయస్వాల్, సంతోష్ గుప్తా, దేవనాథ్ యాదవ్ హాజరయ్యారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు బండారుపల్లి రామచంద్రరావుకు సాహితీ జిగీష ఘన సన్మానం

పౌరాణిక క్విజ్ పోటీలలో గెలుపొందిన బాలబాలికలలు బహుమతుల ప్రదానం

హైదరాబాద్ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సాహితీజిగీష సంస్థ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఆధ్యాత్మిక కవి బండారుపల్లి రామచంద్రరావుకు 'ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని' అందించి ఘనంగా సత్కరించింది. భారత తొలి ప్రధాని నెహ్రూ జయంతిని పురస్కరించుకొని జిగీష సాహితీ సాంస్కృతిక సంస్థ ఆద్వర్యం లో భావితరాలకు పురాణాలు, ఇతిహాసాలు తెలియజే పౌరాణిక క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా త్యాగరాయగానసభ లో క్విజ్ పోటీల్లో గెలుపొందిన బాలబాలికలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ క్విజ్ పోటీల్లో 300మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా. వ్యాఖ్యాన కళాప్రవీణ, కవి పెద్దూరి వెంకటదాసు హాజరై బాలలను అభినందించారు. బాల్యంలో తాను ఎన్టీఆర్ అభిమానిని అని పేర్కొన్నారు. వానవిరశూర కర్ణచిత్రంలో ఎన్టీఆర్ అలపించిన పద్యాలను సమ్మోహనంగా పాడి నిన్పించారు. క్రమశిక్షణ, ఏకాగ్రత, భక్తితో విద్యార్థులు ఉన్నత విజయాలు సాధిస్తారని పేర్కొన్నారు. సాహితీజిగీష వ్యవస్థాపకులు డా. పులిగడ్డ విజయలక్ష్మి, లలితవాణి మానస కవి రఘుశ్రీ సభను నిర్వహించారు. బండారుపల్లి ఉపాధ్యాయుడిగా సాదించిన విజయాలను, కీర్తిని, నిబద్ధత, ఆధ్యాత్మికత, సహృదయత, కుటుంబజీవనంలో విలువలు, సంస్థ నిర్వహణ తదితర బహుముఖ ప్రజ్ఞను కనబరుస్తున్న బండారుపల్లిని వారు కీర్తించారు.

అల్ఫోర్స్ అధ్యాపకురాలికి డాక్టరేట్

కరీంనగర్, డిసెంబర్ 3:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ అల్ఫోర్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మాథమెటికల్ సైన్సెస్ లో ప్రిన్సిపాల్ విధులు నిర్వహిస్తున్న బాలసాని శ్రీనితకు డాక్టరేట్ రావడంపై అల్ఫోర్స్ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ వి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీనిత అల్ఫోర్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మాథమెటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ విధులు నిర్వహిస్తూ కూడా డాక్టరేట్ సాధించడం కొరకు అహర్నిశలు కృషి చేసి డాక్టరేట్ పొందడం అభినందనీయమన్నారు. శ్రీనిక జీవితంలో అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకున్నారు.

అధ్యాపకురాలు శ్రీనితమొయినాబాద్ మండల పరిధిలోని హిమయత్ నగర్ గ్రామ సమీపాన గల చైతన్య డిమ్ టూ బీ యూనివర్శిటి కళాశాలలో గణితశాస్త్ర విభాగములో కంప్యూటేషనల్ ట్రీట్మెంట్, డైనమిక్స్ ఆఫ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్ఫర్ ఇన్ మైక్రోపోలార్ ఫ్లూయిడ్ ఫ్లో అనే అంశంపై ఆచార్య సుందర్రాం, ఎండీ. శంషోద్దీన్ల పర్యవేక్షణలో పరిశోధన నిర్వహించగా, చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అధికారిణి సాత్విక్‌రెడ్డిడాక్టరేట్ ను అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ లో పనిచేసే అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం
ఆధ్వర్యంలో

సోమేపల్లి సాహితీ సౌరభం

15 డిసెంబర్ 2024, ఆదివారం
కాటన్ అసోసియేషన్ హాల్, లక్ష్మీపురం, గుంటూరు.

రమ్యభారతి

ఉదయం 9.30 గంటలకు
సోమేపల్లి వెంకటసుబ్బయ్య స్మారక సంచిక ఆవిష్కరణ

అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, జాతీయ అధ్యక్షులు, అరసం
ముఖ్య అతిథి, ఆవిష్కర్త డా. పాపినేని శివశంకర్, కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు గ్రహీత
ఆత్మీయ అతిథులు ఐ. రమేష్ బాబు వైద్యులు
షేక్ ఇస్మాయిల్ డిప్యూటీ కలెక్టర్ (రి.)
మానుకొండ ఉపేంద్ర రావు అడ్వకేట్
తోటకూర వేంకటనారాయణ రచయిత

ఉదయం 11 గంటలకు
సోమేపల్లి సాహిత్య సదస్సు

అధ్యక్షులు వెలువోలు నాగరాజ్యలక్ష్మి కవి, రచయిత్రి
వచన కవిత్వం డా. సుంకర గోపాల్ కవి, విమర్శకులు
నానీలు కె.జె.రమేష్ కవి, రచయిత

ఉదయం 12.15 గంటలకు
నానా రచన 'నా.. నానీలు' ఆవిష్కరణ

అధ్యక్షులు షేక్ కాసింబి కవి, రచయిత్రి
ఆవిష్కర్త డా. సి. భవానిదేవి, అధ్యక్షులు, ఆం.ప్ర. రచయితల సంఘం
స్వీకర్త సోమేపల్లి విజయలక్ష్మి
సమీక్ష రాచమల్ల ఉపేందర్ కవి, రచయిత
స్పందన నానా కవి

మధ్యాహ్నం 1.15 గంటలకు భోజన విరామం

రైతు వద్ద లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ తహసీల్దార్

అమరావతి డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ఓ రైతు వద్ద లంచం తీసుకున్న తహసీల్దార్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నెల్లూరు జిల్లా ముత్తుకూరు తహసీల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతు పొలం వివరాల కోసం తహసీల్దార్‌ను సంప్రదించాడు.అయితే తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి రూ. 20 వేల లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయగా అధికారులు వ్యూహం ప్రకారం తహసీల్ కార్యాలయంపై దాడి చేశారు. రైతు నుంచి రూ. 20 వేలు తీసుకుంటుండగా అక్కడే మాటువేసిన అధికారులు తహసీల్దార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తహసీల్దార్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు పంపారు.

ఫోమ్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం..

న్యూఢిల్లీ, డిసెంబర్ 3:దేశ రాజధాని ఢిల్లీలోని ఓ ఫోమ్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈశాన్య ఢిల్లీలోని కరవాల్ నగర్ ఏరియాలో ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీ నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్థానికులు సమాచారం మేరకు ఘటనా ప్రాంతానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పుతున్నారు.

అగ్నిప్రమాదం జరిగిందన్న సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని ఫైరింజన్‌ల సాయంతో మంటలు ఆర్పుతున్నామని, మంటలు ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదని అగ్నిమాపక సిబ్బంది చెప్పారు.

మారిన శ్రీశైలం మల్లన్న భక్తులకు దర్శన సమయాలు మారినయ్..!

అమరావతి, డిసెంబర్ 3: జ్యోతిర్లింగ క్షేత్రం, శక్తిపీఠమైన శ్రీశైలానికి వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరుగుతున్నది. క్రమంలో దర్శన విధానంలో మార్పులు చేసినట్లు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ పేర్కొన్నారు. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం కల్పిస్తూ రద్దీ రోజుల్లో మల్లన్న దర్శన భాగ్యం అందరికీ ఒకేలా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వారాంతపు రోజులు, ప్రభుత్వ సెలవుదినాలు, వైదిక కమిటీ సూచించిన ప్రత్యేక పర్వదినాలు, మహోత్సవాల సమయంలో గర్భాలయ అభిషేకాలు, స్పర్శ దర్శనాలు, శ్రీచక్ర కుంకుమార్చనలతోపాటు ఉదయాస్తమాన సేవ, ప్రాతః కాలసేవ, ప్రదోషకాల సేవలను సైతం నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

అదే విధంగా శ్రీవృద్ధ మల్లికార్జున స్వామికి జరిపించే అభిషేకాలు, బిల్వార్చనలు యథావిధిగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వారాంతపు సెలవుల్లో రోజుకు 40వేల మంది భక్తులకుపైగా స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. మహాశివరాత్రి, ఉగాది బ్రహ్మోత్సవాల సమయంలో రోజుకు దాదాపు లక్ష మందికిపైగా భక్తులు క్షేత్రానికి తరలివస్తున్నారని ఈవో పేర్కొన్నారు. రద్దీ రోజుల్లో భక్తులందరి దర్శనార్థం దేవస్థానం వైదిక కమిటీ తీసుకున్న నిర్ణయాలకు భక్తులు సైతం సహకరించాలని ఈవో కోరారు.

రాష్ట్రస్థాయిలో కిష్టాపూర్ విద్యార్థికి ద్వితీయ స్థానం..

ఆదిలాబాద్, డిసెంబర్ 3:ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర స్థాయిలో మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వేల్పుల నరేందర్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు.

ఈ సందర్భంగా హైదరాబాద్ లోని నాంపల్లి ఆదర్శ ఆలియా ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు దేవసేన, రాష్ట్ర విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్య చేతుల మీదుగా ఫీల్డ్ సు, ప్రశంసా పత్రాన్ని నరేందర్ అందుకున్నారు.

ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పునరుత్పాదక శక్తి వనరులు అనే అంశంపై ఆ విద్యార్థి నరేందర్ ప్రదర్శించిన దానికి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం వచ్చింది.

ఈ సందర్భంగా ఆ విద్యార్థిని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, జిల్లా సెక్టోరల్ అధికారులు సత్యనారాయణమూర్తి, చైదరి,శ్రీనివాసరావు,హెచ్.ఎం రాజన్న,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మంగ,ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కమలాకర్, గొవర్దన చారి,రాజన్న, బుచ్చిలింగం ,తదితరులు అభినందించారు.

గాంధీ భవన్ లో ప్రజా విజయోత్సవ సంబరాలు..

- రేవంత్ రెడ్డి కీ అండగా ఉందామని మెట్టు సాయి కుమార్ పిలుపు

హైదరాబాద్ డిసెంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్); కాంగ్రెస్ పార్టీ పాలనకు నేటి తో ఏడాది పూర్తి అయిన సందర్భంగా ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఆధ్వర్యంలో గాంధీ భవన్ లో ఘనంగా ప్రజా విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ మాట్లాడుతూ నేటికీ కాంగ్రెస్ పార్టీ ఏర్పడి ఏడాది పూర్తి అని,నియంత పాలన నుండి ప్రజా పాలనకు వచ్చిన రోజు అన్నారు. ప్రజలు ప్రజా పాలనను ఆవోదించిన రోజు అన్నారు.నిరుద్యోగులను, అమరవీరుల కుటుంబాలను, ప్రజా సంఘాలను హక్కున చేర్చుకున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ..దశబ్ద కాలం పాటు అణిచివేయబడిన ప్రజాసంఘాలకు స్వేచ్ఛ కల్పించ న రోజు....ఈ రోజును తెలంగాణ ప్రజలు మరచిపోలేని రోజు....ఈ రాష్ట్రం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న రేవంత్ రెడ్డి కీ అండగా ఉందామని పిలుపు నిచ్చారు....కులగణన ఈ దేశానికే రోల్ మోడల్ అవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రము లో మరో పదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారం లో ఉంటుందన్న ధీమా వ్యక్తం చేసారు.



Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.